వలంటీర్లకు హ్యాండిచ్చారు!

● ఇప్పటికీ అందని రేషన్ పంపిణీ ప్రోత్సాహక నగదు



తిరుపతి(కలెక్టరేట్), ఫిబ్రవరి 13: ఇంటికే రేషన్ సరఫరా పేరుతో వైసీపీ ప్రభుత్వం ఎండీయూ వాహనాలను ప్రవేశపెట్టింది. అయితే ఆపరేటర్లు వీధిలో ఒకటి రెండు చోట్ల మాత్రమే వాహనాన్ని ఆపి రేషన్ పంపిణీ చేస్తున్నారని, కార్డుదారుల వద్దకు వెళ్లి నేరుగా ఇవ్వడం లేదని గుర్తించాక రేషన్ పంపిణీలో వలంటీర్లను భాగస్వాములను చేస్తూ గత ఏడాది జీవో తీసుకువచ్చింది. జిల్లాలోని 34 మండలాలు, 7 మున్సిపాలిటీల్లో ఒక్కో వలంటీరు పనిచేసే ప్రాంతంలో సుమారు 5పాయింట్ల చొప్పున 55వేల పంపిణీ పాయింట్లను పౌరసరఫరాల శాఖ అధికారులు ఎంపికచేశారు.ఈ పాయింట్ల వద్ద ప్రతి నెలా ఎండీయూ వాహన ఆపరేటరు, స్థానిక వాలంటీరు పర్యవేక్షణలో కార్డుదారులకు బియ్యం, పంచదార, కందిపప్పు, గోధుమపిండి పంపిణీ చేయించాలని జిల్లా యంత్రాంగం ఆదేశించింది.ఇందుకోసం వలంటీర్లకు నెలకు ప్రోత్సాహకం కింద రూ.750 చొప్పున చెల్లిస్తామని ప్రభుత్వం ప్రకటించింది.జిల్లాలోని 1,457 రేషన్ దుకాణాల ద్వారా వచ్చే బియ్యం, కందిపప్పు, చక్కెర పంపిణీ వలంటీర్ల ఆధ్వర్యంలో జనవరి నుంచి ప్రారంభమైంది. గత నెలలో పనిచేసిన వలంటీర్లకు ప్రోత్సాహకం కింద ఇంత వరకు రూపాయి కూడా చెల్లించకపోవడంతో నిరుత్సాహపడుతున్నారు.పౌరసరఫరాల శాఖ నుంచి జనవరి నెలకు విడుదల కావాల్సిన ప్రోత్సాహకం రూ.88.72లక్షల్లో ఇంతవరకూ చిల్లిగవ్వకూడా అందకపోవడంతో ఫిబ్రవరి నెలలో ఎండీయూ వాహనాల్లో రేషన్ సరుకుల పంపిణీ పర్యవేక్షణకు వలంటీర్లు ఆసక్తి చూపలేదు. ఈ విషయమై జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి రాజారఘువీర్‌ను అడగ్గా ఇంకా నిధులు రానిమాట వాస్తవమేనన్నారు. డబ్బులు వచ్చిన వెంటనే చెల్లిస్తామని చెప్పారు.

ముక్కంటికి భారీ ఆదాయం



దక్షిణామూర్తి సన్నిధిలో హుండీ లెక్కింపు

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 13 : శ్రీకాళహస్తీశ్వరాలయానికి రికార్డుస్థాయి ఆదాయం లభించింది.ఆలయంలోని గురు దక్షిణామూర్తి సన్నిధిలో జరిగిన లెక్కింపులో 1,85,80,188రూపాయలు హుండీ ద్వారా వచ్చింది. బంగారం 118 గ్రాములు, వెండి 572.350కేజీలు రాగా వివిధ దేశాలకు చెందిన 153 నోట్లు లభించాయి. 34 రోజుల తర్వాత జరిగిన లెక్కింపులో వచ్చిన ఈ ఆదాయం సరికొత్త రికార్డుగా అధికారులు ప్రకటించారు.

ఎస్వీయూ ఉద్యోగులతో నేడు అభినయ్ సమావేశం

ఎంప్లాయీస్ యూనియన్ నాయకుల ఆహ్వానంపై గవర్నర్‌కు విపక్షాల ఫిర్యాదు

తిరుపతి, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): తిరుపతి వైసీపీ ఇన్‌చార్జి భూమన అభినయ్‌రెడ్డి నేడు ఎస్వీయూ ఉద్యోగులతో సమావేశం కానున్నారు. శ్రీనివాసా స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లోని ఇండోర్ స్టేడియంలో బుధవారం మధ్యాహ్నం 12 నుంచీ 2 గంటల వరకూ యూనివర్సిటీ ఉద్యోగులతో సమావేశం కానున్నారు.ఈ విషయమై అధికార పార్టీకి, స్థానిక వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థికి అండగా నిలవాలని ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు ఉద్యోగులకు వాయిస్ మెసేజ్ పంపడం వివాదాస్పదంగా మారింది. అభినయ్‌రెడ్డి ద్వారా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్ళి సమస్యలు పరిష్కరించుకుందామంటూ మెలిక పెట్టడం ఆ మెసేజ్‌లో వినిపించింది. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి అధికారులు సుముఖంగానే ఉన్నారనీ, అయినా ప్రభుత్వంలోని కీలకమైన నాయకులతో చెప్పిస్తే పని మరింత త్వరగా అవుతుందని చెప్పడం గమనార్హం. దీనిపై గవర్నర్‌కు విపక్షాలు ఫిర్యాదు చేశాయి. ఎన్నికల సమావేశానికీ, ఉద్యోగుల సమస్యలకూ లింకు పెట్టడంపై గవర్నర్ కార్యాలయానికి ప్రతిపక్షాలు మెయిల్స్ ద్వారా ఫిర్యాదు చేసినట్టు సమాచారం.

శ్రీకాళహస్తి వైసీపీ అభ్యర్థిత్వంపై సర్వే

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 13: శ్రీకాళహస్తి వైసీపీ అభ్యర్థిత్వంపై విజయవాడ నుంచి విచ్చేసిన ఏడుగురు సభ్యుల బృందం రహస్యంగా సర్వే చేస్తున్నట్లుట్లు సమాచారం. మంగళవారం శ్రీకాళహస్తి పరిసరాల్లో పర్యటించిన ఆ బృందం వైసీపీలో చురుగ్గా ఉన్న క్షేత్రస్థాయి నాయకులను కలిసి అభిప్రాయాలను సేకరించింది. అలాగే పార్టీపై అసంతృప్తితో అంటీముట్టనట్టు వ్యవహరిస్తున్న వారినీ కలిసి అభిప్రాయాలను సేకరించినట్లు సమాచారం.

నేటి నుంచి ఉద్యోగుల ఆందోళన బాట

చిత్తూరు, ఫిబ్రవరి 13: ఉద్యోగుల సమస్యలను పరిష్కరించకపోతే ప్రత్యక్ష ఆందోళనలకు సిద్ధమని ఏపీ జేఏసీ జిల్లా అధ్యక్షుడు కేవీ రాఘవులు హెచ్చరించారు. చిత్తూరులోని ఎన్‌జీవో భవనంలో మంగళవారం ఆయన సంఘ నేతలతో కలిసి విలేకరులతో మాట్లాడారు. 30శాతం ఫిట్‌మెంట్‌తో 12వ పీఆర్సీని వెంటనే ప్రకటించాలని, పెండింగ్‌లో ఉన్న డీఏ బకాయిలు, సరెండరు లీవు, జీపీఎఫ్, ఏపీజీఎల్ఐ తదితర డిమాండ్లను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. జీపీఎస్, సీపీఎస్‌లను రద్దు చేసి ఓపీఎస్ విధానాన్ని అమలు చేయాలని కోరుతూ బుధవారం ఉద్యోగులందరూ నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన చేపడతామన్నారు. 15న భోజన విరామ సమయంలో నిరసన, 17న అన్ని తాలూకా కేంద్రాల్లో నిరసనలు, ర్యాలీలు, 20న జిల్లాకేంద్రంలో ర్యాలీ, ధర్నా ఉంటుందన్నారు. 21 నుంచి 24వ తేదీ వరకు రాష్ట్ర నాయకులు జిల్లాలో పర్యటిస్తారన్నారు. 27న విజయవాడలో ఛలో అసెంబ్లీ ముట్టడి కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమాల్లో ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు పాల్గొనాలని ఆయన కోరారు.

బసవయ్యపాలెం చెరువు ఆక్రమణకు చెక్

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

శ్రీకాళహస్తి/తొట్టంబేడు, ఫిబ్రవరి 13:బసవయ్యపాలెం చెరువు కబ్జాకు తాత్కాలికంగా అడ్డుకట్ట పడింది. శ్రీకాళహస్తి పట్టణ శివారులోని బసవయ్య పాలెం చెరువు పక్కన వేసిన వెంచర్‌కోసం చెరువులోనే బాట వేసేందుకు రియల్టర్లు తెగబడడంపై సోమవారం ఆంధ్రజ్యోతిలో ప్రైవేట్ వెంచర్ కోసం చెరువులో బాట...! శీర్షికతో కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. దీనిపై కలెక్టర్ లక్ష్మీశ సీరియస్‌గా స్పందించి తొట్టంబేడు రెవెన్యూ అధికారులను చర్యలు తీసుకోవాల్సిందిగా ఆదేశించారు. దీంతో వీఆర్వో మురళి పోక్లైనర్‌తో ఘటనా స్థలానికి చేరుకుని చెరువు భూమిలో ఏర్పాటు చేసిన సిమెంట్ పైపులను పక్కకు తొలగించారు. అయితే ఆ సిమెంట్ పైపులను సమీపంలోనే ఉంచి వెళ్లడంతో వివాదం సద్దుమణిగిన తర్వాత మళ్లీ రోడ్డు వేసే అవకాశం కన్పిస్తోంది.ఉన్నతాధికారులు గట్టి చర్యలు తీసుకుంటే తప్ప రియల్టర్ల ఆగడాలు ఆగే అవకాశాల్లేవు.



చెరువులో బాటకోసం రియల్టర్లు వేసిన పైపుల తొలగింపు

నిరుద్యోగులపైనా బాదుడే

● టెట్ రుసుం రూ.250 పెంపు

● ఎస్సీ, ఎస్టీలకు మినహాయింపు లేదు

చిత్తూరు కలెక్టరేట్, ఫిబ్రవరి 13: ప్రభుత్వ పోటీపరీక్షలకు దరఖాస్తు అంటేనే నిరుద్యోగులు భయపడే పరిస్థితి నెలకొంది. ఉమ్మడి జిల్లాలో 336 ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదలైంది. వీటికి వేలాది మంది పోటీపడేందుకు సిద్ధమవుతున్నారు. ఈ డీఎస్సీ రాసేందుకు అభ్యర్థులు టెట్‌లో అర్హత సాధించాలి. 2022లో వైసీపీ ప్రభుత్వం టెట్ నిర్వహించింది. అప్పట్లో పేపర్‌కు రూ.500 చొప్పున రుసుము వసూలు చేశారు. తాజాగా దీనిని రూ.250 పెంచి రూ.750గా ఖరారుచేశారు. ఇందులో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మహిళలు, దివ్యాంగులకు ఎలాంటి మినహాయింపులు ఇవ్వలేదు. జనవరిలో కేంద్ర ప్రభుత్వం సీ-టెట్ నిర్వహించింది. ఒక్కో పేపర్‌కు రూ.500 రుసుం నిర్ణయించింది. రెండు పేపర్లు రాస్తే రూ.600 మాత్రమే వసూలు చేసింది. అదే మన రాష్ట్రంలో పేపరుకు రూ.750 చొప్పున ఎన్ని పేపర్లు రాయాలంటే అన్నిటికీ వేరువేరుగా రుసుము చెల్లించాల్సిన పరిస్థితి. డీఎడ్, బీఈడీ, ఎంఈడీ విద్యార్హత ఉన్నవారు టెట్ మూడు పేపర్లు రాస్తారు. అదే డీఎడ్, బీఈడీ అర్హతలు ఉంటే తప్పనిసరిగా రెండు పేపర్లు రాయాలి. 2018 తర్వాత డీఎస్సీ లేకపోవడంతో మూడు ఉపాధ్యాయ విద్యార్హతలు ఎక్కువ మందికి ఉన్నాయి. ఒక్క పేపరుకు రూ.750 చొప్పున మూడు పేపర్లకు రూ.2250, రెండు పేపర్లకు రూ.1500 చెల్లించాల్సివుంది. ఇక పరీక్షలకు సిద్ధమయ్యేందుకు సుమారు రూ.3వేల నుంచి రూ.4 వేల వరకు పుస్తకాల కొనుగోళ్లకే ఖర్చు చేయాలి. టీడీపీ హయాంలో శిక్షణ ఇచ్చేందుకు స్టడీ సర్కిల్స్ ఉండేవి. వైసీపీ అధికారంలోకి వచ్చాక స్టడీ సర్కిల్స్ మాయమయ్యాయి. దాంతో అభ్యర్థులు సొంతంగా పరీక్షలకు సిద్ధం కావాల్సిన పరిస్థితి నెలకొంది.

వేడుకగా పద్మావతి ఆలయ శుద్ధి



అమ్మవారి గుడికి అందించిన పరదాలు

తిరుచానూరు, ఫిబ్రవరి 13 : రథసప్తమిని పురస్కరించుకుని తిరుచానూరు పద్మావతి అమ్మవారి ఆలయంలో మంగళవారం కోయిల్ అళ్వార్ తిరుమంజనం జరిగింది. ఉదయం 6.30 నుంచి 9గంటల వరకు అర్చకులు, అధికారులు, పరిచారకులు ఆలయాన్ని నామకోపు, శ్రీచూర్ణం, కస్తూరి పసుపు, పచ్చాకు, కర్పూరం, గంధం పొడి, కుంకుమ, కిచిలిగడ్డ తదితర సుగంధ ద్రవ్యాలు కలగలిపిన మిశ్రమంతో ప్రోక్షణ చేశారు. అనంతరం భక్తులను సర్వదర్శనానికి అనుమతించారు.తిరుమంజనం సందర్భంగా పలు సేవలను రద్దు చేశారు. ఇక హైదరాబాద్‌కు చెందిన స్వర్ణకుమారి అనే దాత అమ్మవారి ఆలయానికి పరదాలను కానుకగా అందజేశారు.కాగా రథసప్తమిని పురస్కరించుకుని శుక్రవారం పద్మావతి అమ్మవారు సప్తవాహనాలపై తిరుమాడ వీధుల్లో ఊరేగనున్నారు.

‘ఎన్నికల’ బదిలీ..!

● ఆళ్లగడ్డకు ట్రాన్స్‌ఫర్ చేసినా చేరని వైనం

● చిత్తూరు ఎస్‌బీ డీఎస్పీగా వెనక్కి

● పట్టుబట్టి సుధాకర్‌రెడ్డిని వేయించుకున్న అధికార పార్టీ పెద్దలు



సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో మూడేళ్లు పని చేసిన అధికారులు.. పక్క జిల్లాలకు బదిలీ కావాలి. లేదా ఎన్నికలకు సంబంధంలేని లూప్‌లైన్‌కు పంపాలి. ఈ నిబంధనల మేరకు పలమనేరు డీఎస్పీ సుధాకర్‌రెడ్డిని నంద్యాల జిల్లా ఆళ్లగడ్డకు బదిలీ చేశారు.

బదిలీ అయి వారం రోజులైనా ఆయన అక్కడ చేరలేదు. మళ్లీ, మంగళవారం చిత్తూరు స్పెషల్ బ్రాంచి డీఎస్పీగా సుధాకర్‌రెడ్డిని బదిలీ చేస్తూ డీజీపీ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ బదిలీ ఎన్నికల్లో అధికార పార్టీకి మేలు కోసమని ప్రతిపక్షాలు విమర్శిస్తున్నాయి.

ఎందుకంటే.. వైసీపీ అధికారంలోకి వచ్చాక డీఎస్పీ సుధాకర్‌రెడ్డి వివాదాస్పద అధికారిగా పేరుపొందారు. పలమనేరు రెగ్యులర్, కుప్పం ఇన్‌చార్జి డీఎస్పీగా ఆయన తీసుకున్న నిర్ణయాలు ప్రతిపక్షాల నుంచి తీవ్ర విమర్శలకు తావిచ్చాయి. చంద్రబాబు అరెస్టు సమయంలో పలమనేరు, గంగవరంలో ప్రైవేటు స్థలాల్లోనూ టీడీపీ నిరసనలు చేయనీయకుండా అడ్డుకున్న విషయాన్ని వారు ప్రస్తావిస్తున్నారు. చంద్రబాబు పర్యటన.. లోకేశ్ యువగళం పాదయాత్రలోనూ అడుగడుగునా ఆంక్షల పేరిట అడ్డుకున్నారు. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆదేశాలను పాటిస్తారనే విమర్శలున్నాయి. పుంగనూరు నియోజకవర్గంలో పోలీసు రాజ్యం నడుస్తుందని, అక్రమ కేసులతో ప్రతిపక్షాలను వేధిస్తున్నారంటూ ఆరోపణలున్నాయి. ఈ క్రమంలో ఎన్నికల్లో అధికార పార్టీకి ప్రయోజనం కోసమే డీఎస్పీ సుధాకర్‌రెడ్డిని లూప్‌లైన్ సాకుతో చిత్తూరు ఎస్‌బీకి బదిలీ చేయించారనే ప్రచారం జరుగుతోంది.

- ఆంధ్రజ్యోతి, చిత్తూరు/ చిత్తూరు

వైసీపీ పాలనలో రాయలసీమకు అన్యాయం



ప్రచారం నిర్వహిస్తున్న చింతా మోహన్

తిరుపతి(తిలక్‌రోడ్), ఫిబ్రవరి 13: వైసీపీ పాలనలో రాయలసీమకు తీరని అన్యాయం జరిగిందని కేంద్ర మాజీ మంత్రి చింతామోహన్ విమర్శించారు. మంగళవారం అన్నమయ్య కూడలి వద్ద ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వైసీపీ పాలనలో ఎక్కడ చూసినా కరువు కాటకాలు, నిరుద్యోగం, అధిక ధరలు, అప్పులు తప్ప సామాన్య ప్రజలకు ఏం మిగిలిందని ప్రశ్నించారు. ఈ బాధలన్నీ పోవాలంటే తిరుపతిని రాజధాని చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు గోపిగౌడ్, తేజోవతి, వెంకటేష్, రవి, జావిద్ తదితరులు పాల్గొన్నారు.

విధుల్లో అలసత్వం వద్దు


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ లక్ష్మీశా

తిరుపతి(కలెక్టరేట్), ఫిబ్రవరి 13: జిల్లాలో ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని, ఇందులో ఎలాంటి అలసత్వానికీ తావులేదని కలెక్టర్ లక్ష్మీశా అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో పలు శాఖల సీనియర్ అధికారులు, ఎన్నికల నోడల్ అధికారులతో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ నోడల్ అధికారులు తమ బాధ్యతలను సక్రమంగా నిర్వహించాలన్నారు. ఇందులో ఎలాంటి పొరబాటు జరిగినా చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో పెంచలకిషోర్, నోడల్ అధికారులు, ఎన్నికల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మల్లంగుంటలో బాలిక మిస్సింగ్

● దర్యాప్తు చేపట్టిన రూరల్ పోలీసులు


మౌనిక

తిరుపతి రూరల్, ఫిబ్రవరి 13: మల్లంగుంట వైఎస్ఆర్ కాలనీకి చెందిన ఓ బాలిక అదృశ్యం అయినట్టు తిరుపతి రూరల్ పోలీసులకు ఫిర్యాదు అందింది. మల్లంగుంటకు చెందిన ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న మౌనిక (17) ఆచూకీ కన్పించడం లేదని కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. బంధువులు, స్నేహితుల ఇంటి వద్ద బాలిక జాడ కోసం వెతికినా కన్పించలేదన్నారు. వారికి అనుమానం ఉన్న వ్యక్తిపై ఫిర్యాదులో ప్రస్తావించారు. ఈ మేరకు తిరుపతి రూరల్ ఎస్ఐ షేక్షావలి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

వాహనం ఢీకొని చెన్నైవాసి మృతి


మృతుడు అర్జున్‌కాంత్

తిరుపతి రూరల్, ఫిబ్రవరి 13: తిరుపతి జిల్లా నాయుడుపేట-పూతలపట్టు జాతీయ రహదారిపై వకుళమాత ఆలయ సమీపంలో గుర్తు తెలియని వాహనం ఢీకొని చెన్నైకి చెందిన ఓ వ్యక్తి మృతి చెందాడు. మృతుడు చెన్నై లోని రామలింగ నగర్‌కు చెందిన అర్జున్‌కాంత్ (38) గా పోలీసులు గుర్తించారు. మంగళవారం తెల్లవారుజామున గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగిందని, మృత దేహాన్ని పోస్టు మార్టంకు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్టు తిరుపతి రూరల్ ఎస్ఐ షేక్ షావలి తెలిపారు.

విద్యాసామగ్రి అందజేత



తిరుపతి రూరల్, ఫిబ్రవరి 13: తిరుపతి రూరల్ మండలంలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు మంగళవారం తుడా ఛైర్మన్ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి విద్యాసామగ్రి అందజేశారు. ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను సద్వినియోగం చేసుకొని విద్యార్థులు ఉన్నత స్థాయికి చేరాలని ఆకాంక్షించారు.

ట్రాక్టర్ కిందపడి యువకుడి మృతి


బాలాజి (ఫైల్ ఫొటో)

చంద్రగిరి, ఫిబ్రవరి 13: తొండవాడ సమీపంలోని జగనన్న కాలనీ వద్ద ఓ యువకుడు ప్రమాదవశాత్తు ట్రాక్టర్ కిందపడి మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు.. తిరుపతి రూరల్ మండలం, పాతకాల్వకు చెందిన వరదారెడ్డి తన కుమారుడు బాలాజీ(18)తో కలిసి పిచ్చినాయుడుపల్లె క్వారీ నుంచి కంకరను ట్రాక్టర్‌లో లోడు చేసుకుని జగనన్న కాలనీకి బయలుదేరారు. మార్గమధ్యంలో ట్రాక్టర్ ఆపి వరదారెడ్డి కాలకృత్యాలకు వెళ్లాడు. ఆ సమయంలో ట్రాక్టర్ ముందుకు వెళ్లడంతో ఇంజన్‌లో ఉన్న బాలాజీ కింద పడ్డాడు. ఆ సమయంలో ట్రాలీ వెనుక చక్రాలు బాలాజీపై వెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృత దేహాన్ని పోలీసులు పోస్టు మార్టం నిమిత్తం తిరుపతి ఎస్వీ మెడికల్ కళాశాలకు తరలించారు.

విద్యా సామగ్రి పంపిణీ

చంద్రగిరి, ఫిబ్రవరి 13: చంద్రగిరి పట్టణం, దోర్నకంబాల, గంగుడుపల్లె, పంచాయతీల్లోని ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు మంగళవారం ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి సతీమణి లక్ష్మి విద్యా సామాగ్రి పంపిణీ చేశారు. నోట్ బుక్స్, రైటింగ్ ప్యాడ్స్, బ్రెయిన్ ఎక్సర్‌సైజ్ ఫిజికల్ షీట్లు పంపిణీ చేశారు.

చంద్రగిరి

మామిడిలో సమగ్ర సస్యరక్షణ చర్యలు చేపట్టండి

భాకరాపేట, ఫిబ్రవరి 13: మామిడిలో సమగ్ర సస్య రక్షణ చర్యలు చేపడితే నాణ్యమైన దిగుబడులు వస్తాయని ఉద్యాన శాఖాధికారి దశరథరామిరెడ్డి తెలిపారు.చిన్నగొట్టిగల్లు మండలం చిట్టేచెర్ల, దేవరకొండ ప్రాంతాల్లోని మామిడి తోటలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన రైతులతో మాట్లాడుతూ ఈ ఏడాది మామిడిలో పూత ఆలస్యమై ఇప్పుడిప్పుడే అక్కడక్కడా కనపడుతోందన్నారు.అనంతరం చిట్టేచెర్లలో ప్యాక్ హౌస్ నిర్మాణాన్ని పరిశీలించారు. చిన్నగొట్టిగల్లులోని నర్సరీని సందర్శించారు.ఉద్యాన అధికారిణి శివకుమారి, వెలుగు ఏపీఎం కుమార్, ఆర్బీకే ఇన్‌చార్జులు రాహుల్, కిశోర్, వనిత, వెంకటేశ్వరి పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకి అటవీ కార్మికుల కృతజ్ఞతలు

తిరుపతి, ఫిబ్రవరి13 (ఆంధ్రజ్యోతి) : తమ సమస్యల పరిష్కారానికి కృషి చేసిన ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డికి టీటీడీ అటవీ కార్మికులు కృతజ్ఞతలు తెలిపారు. మంగళవారం వారు సీపీఎం నాయకులతో కలసి ఎమ్మెల్యే ఇంటికెళ్లారు. ఈ సందర్భంగా ఆయన ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన 'వామపక్షం...తిరుపతిలో అధికారపక్షం' కథనం గురించి ప్రస్తావించారు. వామపక్షాల ఆందోళనల వల్లే వివిధ సంస్థల్లో పనిచేస్తున్న కార్మికుల సమస్యలు తన దృష్టికి వస్తున్నాయని, అప్పుడే వాటిని పరిష్కరించగలుగుతున్నానని అన్నారు. వామపక్ష నాయకులతో తనకు వ్యక్తిగత అనుబంధమే గాక భావసారూప్యత ఉందని, తాను కూడా ఎర్రజెండా నీడన పెరిగినవాడినేనని చెప్పుకొచ్చారు. మేలుచేసిన కరుణాకరరెడ్డికి కృతజ్ఞతలు చెప్పడం నేరమా? ఎర్రజెండాకు మరకలు అంటించలేరని సీపీఎం నాయకుడు కందారపు మురళి స్పష్టం చేశారు.

గంజాయి బ్యాచ్ ఆగడాలను అరికట్టండి

● నానీకి సాయినగర్‌వాసుల మొర



తిరుపతి రూరల్, ఫిబ్రవరి 13: చీకటి పడ్డాక అడుగు బయట పెట్టాలంటే భయంగా ఉందని చంద్రగిరి టీడీపీ ఇన్‌చార్జి పులివర్తి నానికి సాయినగర్‌వాసులు మొర పెట్టుకున్నారు. మితిమీరిపోయిన గంజాయి బ్యాచ్ ఆగడాలనుంచి రక్షణ కల్పించాలని వేడుకున్నారు.మీ ఇంటి వద్దకే మీ పులివర్తి నాని కార్యక్రమంలో భాగంగా మంగళవారం సాయినగర్‌లో నాని పర్యటించారు. ఈ సందర్భంగా పార్కుల వద్ద, మైదాన ప్రాంతాల్లో రాత్రిళ్ళు గంజాయి సేవిస్తూ ఆ మార్గంలో వచ్చేవారిపై దాడులకు దిగుతున్నారని స్థానికులు వాపోయారు. ఇంత జరుగుతున్నా పోలీసులు కన్నెత్తి చూడటం లేదని చెప్పారు. ఈ సందర్భంగా నాని మాట్లాడుతూ.. సాయినగర్‌లో అండర్ డ్రైనేజీ లేక రోడ్లపైనే మురుగునీరు ప్రవహిస్తోందని, ఏళ్ళ తరబడి పక్కా గృహాలు నిర్మించుకున్న వారికి పట్టాలు రెగ్యులరైజ్ చేయకపోవడం ఏమిటని ప్రశ్నించారు. గంజాయి బ్యాచ్‌కు త్వరలోనే అడ్డుకట్ట వేస్తామని అన్నారు.తిరుపతి రూరల్ టీడీపీ అధ్యక్షుడు ఈశ్వర్ రెడ్డి పాల్గొన్నారు.

టీడీపీ గెలుపుతోనే ప్రజాసమస్యల పరిష్కారం


గ్రామస్తులతో మాట్లాడుతున్న వినీల్

ఎర్రావారిపాళెం, ఫిబ్రవరి 13: టీడీపీ విజయంతోనే ప్రజాసమస్యలు పరిష్కారమవుతాయని టీడీపీ యువ నేత పులివర్తి వినీల్ అన్నారు. ఎర్రావారిపాళెం మండలంలోని కోటకాడపల్లె పంచాయితీలో మంగళవారం 'బాబు ష్యూరిటీ..భవిష్యత్ గ్యారంటీ' కార్యక్రమం నిర్వహించారు.టీడీపీ అధికారంలోకి రాగానే తలకోన ఏటిపై బ్రిడ్జి నిర్మించి కోటకాడపల్లె పంచాయితీ రోడ్డు సమస్య పరిష్కరిస్తామన్నారు.టీడీపీ మండల అధ్యక్షుడు దేశిరెడ్డి రఘునాథ, ప్రధాన కార్యదర్శి మహేష్ నాయుడు, మురళి, హరిశ్చంద్ర, అమరనాథరెడ్డి, చిన్నపరెడ్డి, నిరంజన్ రాయల్, కేశవులనాయుడు తదితరులు పాల్గొన్నారు.

ముక్కంటికి రజత దర్పణం సమర్పణ


ఛైర్మన్‌కు వెండి దర్పణం అందజేస్తున్న భక్తులు

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 13: శ్రీకాళహస్తీశ్వరాలయానికి కడప నగరానికి చెందిన రెయిన్బో హాస్పిటల్ నిర్వాహకులు శ్రీనివాసరావు దంపతులు వెండి దర్పణం సమర్పించారు.

ఈ ఏడాది విద్యుత్ ఛార్జీలు పెరగవు!

-రూ. వంద కోట్ల మేరకు రైల్వేపై అదనపు ఛార్జీల ప్రతిపాదన

-రూ. 3500 కోట్లతో విద్యుత్ పంపిణీ వ్యవస్థ ఆధునీకీకరణ

-ఏపీ ఈఆర్సీ ఛైర్మన్ జస్టిస్ నాగార్జునరెడ్డి

తిరుపతి, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఈ ఏడాది విద్యుత్ ఛార్జీలు పెరగవని ఏపీ ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్ ఛైర్మన్ జస్టిస్ సి.వి.నాగార్జునరెడ్డి స్పష్టం చేశారు. మంగళవారం మధ్యాహ్నం తిరుపతిలోని ఎస్పీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. అంతకు మునుపు నిర్వహించిన స్టేట్ అడ్వైజరీ బోర్డు సమావేశంలో 2023-24 వార్షిక ఆదాయ వ్యయాలపై జెన్‌కో, ట్రాన్స్‌కో నివేదికలు అందజేశాయన్నారు.విద్యుత్ పంపిణీ ఛార్జీలపై రాష్ట్రవ్యాప్తంగా వర్చువల్‌గా అభిప్రాయాలు సేకరించామ న్నారు. ఈ సంవత్సరం రాష్ట్రంలో ఏ వర్గంపైనా విద్యుత్ ఛార్జీల భారం మోపబోవడం లేదన్నారు. దానికనుగుణంగా విద్యుత్ ఛార్జీలు పెంచే ప్రతిపాదనేదీ లేదన్నారు. అయితే అదే సమయంలో రాష్ట్ర పరిధిలోని రైల్వేపై మాత్రం రూ. వంద కోట్ల మేరకు అదనపు ఛార్జీలు మోపే ప్రతిపాదన పరిశీలనలో వుందన్నారు. కాగా రాష్ట్రంలో విద్యుత్ పంపిణీ వ్యవస్థ ఆధునీకీకరణపై ప్రధానంగా దృష్టి సారిస్తున్నామన్నారు. అందులో భాగంగా ట్రాన్స్‌మిషన్ నష్టాలు, లో ఓల్టేజీ, ఓవర్ లోడ్ తదితర సమస్యలను అధిగమించేందుకు రూ. 3500 కోట్లతో విద్యుత్ పంపిణీ వ్యవస్థను ఆధునీకరిస్తామన్నారు. పంపిణీ వ్యవస్థను చక్కదిద్దుకోవడం ద్వారా వ్యవసాయ రంగానికి రోజుకు 9 గంటల పాటు నిరంతర విద్యుత్ సరఫరా చేసే విధానానికి ప్రభుత్వం కట్టుబడి వుంటుందన్నారు. ఈ విషయంలో ఎలాంటి మార్పూ వుండదన్నారు. నేత మగ్గాలకు సంబంధించి విద్యుత్ ఛార్జీలు పెరగవని, అన్ని రకాల వినియోగదారులకూ మెరుగైన సేవలు అందుతాయని భరోసా ఇచ్చారు. విద్యుత్ సంస్థల్లో జరిగే అన్ని అభివృద్ధి పనులూ నిబంధనల మేరకే జరుగుతాయన్నారు. సమావేశంలో ఆయనతో పాటు కమిషన్ సభ్యులు ఠాకూర్ రామ్‌సింగ్, పి.వెంకట్రమణారెడ్డి పాల్గొన్నారు.

పేరూరులో రాజుకున్న పోస్టర్ల వివాదం

హరిపురం కాలనీలో సిక్కర్లుంచిన ఆటోను స్వాధీనం చేసుకున్న పోలీసులు ● స్టేషన్ ఎదుట బైఠాయించి పులివర్తి నాని నిరసన


పేరూరులో పోస్టర్లు తొలగిస్తున్న పంచాయతీ సిబ్బంది

తిరుపతి రూరల్, ఫిబ్రవరి 13: పేరూరు పంచాయతీ హరిపురం కాలనీలో వాల్‌పోస్టర్ల వివాదం రాజుకుంది. గ్రామంలో టీడీపీ నాయకులు వేసిన వాల్ పోస్టర్లను వైసీపీ నాయకులు, పంచాయతీ అధికారులు చింపి పడేశారు. ఈ సందర్భంగా టీడీపీ నాయకులు - పంచాయతీ అధికారుల మధ్య వాగ్వాదం జరిగింది. టీడీపీ స్టిక్కర్లు ఉంచిన ఆటోను సైతం స్టేషన్‌కు తరలించేందుకు పోలీసులు ప్రయత్నించారు. దీనిపై సమాచారం అందుకున్న పులివర్తి నాని తిరుపతి రూరల్ పోలీసు స్టేషన్ దగ్గరకు చేరుకున్నారు.ఈ సందర్భంగా నాని మాట్లాడుతూ.. చంద్రగిరి నియోజకవర్గంలో అధికార పార్టీకి ఒక న్యాయం, ప్రతిపక్షానికి ఒక న్యాయమా? అని ప్రశ్నించారు. సొంత నిధులతో టీడీపీ నాయకులు, కార్యకర్తలు వారి ళ్ళకు పోస్టర్లు అంటించుకుంటే తొలగించడం మంచి పద్ధతి కాదని హితవు పలికారు. చివరకు సీఐ చొరవ తీసుకుని ఆటోను వెనక్కి పంపడంతో నాని శాంతించారు. ఈ వ్యవహారంపై టీడీపీ నాయకులు కాయం వెంకటేష్, దామినేటి నాగరాజుపై పోలీసులకు పంచాయతీ కార్యదర్శి ఫిర్యాదు చేసినట్టు తెలుస్తోంది. అనుమతి తీసుకున్న తర్వాతే తాము స్టిక్కర్లు అతికించుకున్నామని టీడీపీ నాయకులు వాపోయారు.

టీడీపీలోనే అన్ని వర్గాలకూ సముచిత స్థానం

భాకరాపేట, ఫిబ్రవరి 13: సమాజంలోని అన్ని వర్గాలకూ టీడీపీలోనే సముచిత స్థానం ఉంటుందని టీడీపీ నాయకురాలు పులివర్తి సుధారెడ్డి తెలిపారు. చిన్నగొట్టిగల్లు మండలం దేవ్‌దార్లపల్లె పంచాయతీలోని తవ్వావాండ్లపల్లె, రెడ్డివారిపల్లె, ఉత్తరగడ్డ, వడ్డిపల్లె, చట్టేవారిపాళెం పంచాయతీ చెంచులక్ష్మి కాలనీల్లో మంగళవారం ఆమె ఇంటింటి ప్రచారం నిర్వహించారు. టీడీపీ మండల అధ్యక్షుడు బెల్లంకొండ మురళి, కార్యదర్శి మదన మోహన, తెలుగు మహిళ అధ్యక్షురాలు చిట్టెమ్మ, కుమారస్వామిరెడ్డి, ఆర్వీ రమణారెడ్డి, ఎర్రయ్యనాయుడు, మౌలాలి, చలపతి, ఖాదర్‌వలి, కృష్ణమూర్తి, మునస్వామి నాయుడు, వెంకటరామయ్య, శంకర, సుబ్రహ్మణ్యం, చంద్రశేఖర్, మల్లిఖార్జునరెడ్డి, రాజగోపాల్‌నాయుడు, గురుమూర్తి, రెడ్డెప్పరెడ్డి, కృష్ణారెడ్డి, సురేంద్ర పాల్గొన్నారు.

'శ్రీనివాసం' సబ్‌వే విస్తరణ


ప్రారంభమైన పనులు



తిరుపతి(కొర్లగుంట), ఫిబ్రవరి 13: టీటీడీ ఆధ్వర్యంలోని శ్రీనివాసం అతిథి గృహం నుంచి ఆర్టీసీ బస్టాండుకు నడిచి వెళ్లే భక్తుల కోసం 2011లో సబ్‌వేను నిర్మించిన విషయం తెలిసిందే. ఇది కొంతకాలం ఉపయోగకరంగా ఉన్నా రోడ్డు విస్తరణ జరగడంతో ఆరేళ్లుగా నిరుపయోగంగా మారింది. శ్రీనివాసం, మాధవం సముదాయంలో బసచేసే భక్తులు రోడ్డు దాటడానికి ఇబ్బందులు పడుతున్నారు. పైగా శ్రీనివాస సేతు నుంచి ఓ మార్గం సరిగ్గా శ్రీనివాసం ప్రధాన గేటు వద్ద ముగియడంతో భక్తులకు ఇబ్బందులు తప్పడంలేదు. ఈ సమస్యను పరిష్కరించడానికి టీటీడీ ఇంజనీరింగ్ అధికారులు అధ్యయనం చేశారు. వారి నివేదిక మేరకు రూ.2కోట్లతో సబ్‌వే విస్తరణ పనులు చేపట్టారు. సబ్‌వేను శ్రీనివాసం ప్రహరీ వరకు కొనసాగించి, అక్కడి నుంచి వెడల్పాటి సీసీ రోడ్డు నిర్మించనున్నారు. అత్యాధునికంగా తోరణం నిర్మించి.. వాహనాల రాకపోకలకు కూడా రెండు మార్గాలు ఏర్పాటు చేయనున్నారు. ఇవన్నీ పూర్తయితే ఇప్పటి వరకు ఉన్న శ్రీనివాసం ప్రధాన ద్వారాన్ని మార్గాన్ని శాశ్వతంగా మూసివేయనున్నారు.

మురిక్కాలువ సమస్య పరిష్కరించాలి


చంద్రగిరి పోలీస్ స్టేషన్ ముందు ధర్నా చేస్తున్న బడి సుధాయాదవ్

చంద్రగిరి, ఫిబ్రవరి 13 : చంద్రగిరి మండలం రాయలపురం పంచాయతీలోని వెంకటంపేటలో మురి క్కాలువ సమస్య పరిష్కరించాలని ఓబీసీ ఫోరం రాష్ట్ర కన్వీనర్ బడి సుధాయాదవ్ కోరారు. కాలువలోని చెత్తను తొలగించి మురుగునీరు సాఫీగా దిగువకు వెళ్లేలా సర్వీసు రోడ్డు వద్ద అడ్డు తొలగించాలని డిమాండ్ చేశారు. నాలుగు రోజుల క్రితం వెంకటంపేటలోని మురిక్కాలువ సమస్యను పరిష్కరించాలని ఎంపీడీవో వెంకటసూర్యసాయికి వినతిపత్రాన్ని అందజేశారు. రెండు రోజుల్లో సమస్య పరిష్కరించకపోతే ఉద్యమం చేస్తామని హెచ్చరించారు.ఈ క్రమంలో మంగళవారం వెంకటంపేటలోని మురుగు కాలువలోని వ్యర్థాలను రెండు ట్రాక్టర్లకు నింపి ఎంపీడీవో కార్యాలయం ముందు పోసి నిరసన తెలియజేయాలని ప్రయత్నించారు. సమాచారం అందుకున్న పోలీసులు ట్రాక్టర్లను అడ్డుకుని స్టేషన్‌కు తరలించారు.దీంతో పోలీసులకు, బడి సుధాయాదవ్‌కు మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. అనంతరం కిడ్నీ బాధితులు, గ్రామస్తులతో కలిసి పోలీస్ స్టేషన్ ముందు బైఠాయించి ధర్నా చేపట్టారు. ఎంపీడీవో వెంకటసూర్యసాయి,ఈవోఆర్డీ శశిరేఖ, పంచాయతీ కార్యదర్శి అనురాధ పోలీస్ స్టేషన్‌కు వచ్చి కాలువ సమస్య పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు. అనంతరం పోలీసులు, అధికారులతో కలిసి కాలువను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో తాగునీటిలో మురుగునీరు కలుస్తోందన్నారు. ఆ నీరు తాగి స్థానికులు రోగాల బారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల ఇద్దరు కిడ్నీ సమస్యలతో మరణించగా, మరో నలుగురు చికిత్స పొందుతున్నారని తెలిపారు. గతంలోనూ చాలామంది కిడ్నీ సమస్యలతో మృతి చెందారని వివరించారు.

జేఈఈ మెయిన్స్‌లో ప్రైవేట్ విద్యార్థుల ప్రతిభ

తిరుపతి(విద్య), ఫిబ్రవరి 13 : జాతీయ స్థాయిలో ఎన్ఐటీ, ట్రిపుల్ ఐటీ, ఐఐటీ విద్యాలయాల్లో ప్రవేశాల కోసం గత నెలలో నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ ఆధ్వర్యంలో నిర్వహించిన తొలివిడత జేఈఈ మెయిన్స్ ఫలితాలను సోమవారం రాత్రి విడుదల చేశారు. ఈ ఫలితాల్లో తిరుపతిలోని పలు ప్రైవేట్ జూనియర్ కళాశాలల విద్యార్థులు అత్యుత్తమ పర్సంటైల్ మార్కులతో ప్రతిభచాటారు.



● **శ్రీధర్స్ అకాడమీ విద్యార్థుల జయకేతనం:** ఏఐఆర్ బైపాస్ రోడ్డులోని శ్రీధర్స్ అకాడమీ విద్యార్థులు జాతీయ స్థాయిలో ఉత్తమ ఫలితాలు సాధించారని ఛైర్మన్ మద్దినేని శ్రీధర్ పేర్కొన్నారు. వి.సిద్ధార్థరెడ్డి 99.28 పర్సంటైల్, వై.రిషిధర్ రెడ్డి 98.01, కె.హర్షవర్ధన్‌రెడ్డి 97.76, పి.జగత్‌కుమార్ 97.48, ఎంఎస్ లిషిత 96.63, ఎస్.వంశీకృష్ణారెడ్డి 96.54, వి.నిషిత 95.43, ఎస్.అజయ్‌కుమార్ 92.62, వి.జైఆదిత్య 90.27పర్సంటైల్ మార్కులను సాధించారని తెలిపారు. 53మంది 85పర్సంటైల్‌కి పైగా మార్కులు పొంది ప్రతిభచాటారని తెలిపారు. విద్యార్థులను ఛైర్‌పర్సన్ శ్రీవాణి, అధ్యాపకులు అభినందించారు.


అభినందిస్తున్న శ్రీగాయత్రి అకాడమీ కరస్పాండెంట్ నీరజాక్షులు, డైరెక్టర్ కవిత

● **శ్రీగాయత్రి విద్యార్థుల విజయకేతనం:** తిరుపతికి చెందిన శ్రీగాయత్రి ఐఐటీ-మెడికల్ అకాడమీ విద్యార్థులు పి.విష్ణువర్ధన్‌రెడ్డి 98శాతం, వి.విష్ణు 89, ఎన్.రాకేష్ 82 శాతం పర్సంటైల్ మార్కులతో వరుసగా తొలిమూడు స్థానాలు సాధించి విజయకేతనం ఎగురవేశారని కరస్పాండెంట్ ఎ.నీరజాక్షులు పేర్కొన్నారు. మొత్తం మీద 80 శాతంమంది విద్యార్థులు ఐఐటీ అడ్వాన్స్‌కి అర్హత సాధించే మార్కులు పొందారని తెలిపారు. విద్యార్థులను ఆయనతో పాటు డైరెక్టర్ సి.కవిత అభినందించారు.


విద్యార్థులతో శ్రీచైతన్య ఏజీఎం బీవీప్రసాద్

● శ్రీచైతన్య విద్యార్థుల ప్రభంజనం: తిరుపతికి చెందిన శ్రీచైతన్య విద్యాసంస్థల విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలతో జాతీయ స్థాయిలో విజయ ప్రభంజనం సృష్టించారని ఏజీఎం బీవీప్రసాద్ పేర్కొన్నారు. జి.దివ్యకీర్తి 99.56 పర్సంటైల్, ఎ.ప్రేమానందరెడ్డి 99.48, వైఎల్ కుమార్‌రెడ్డి 99.47, ఎ.తేజశ్వి 99.46, ఎంవీ స్వామిబాబు 99.44, పీఎస్‌చంద్ర 99.36, జి.గణేష్‌కుమార్‌రాజు 99.23, జి.యశ్వంత్‌సాయి 99.11, పీఎస్ చరణ్‌రెడ్డి 99.07 వంటి అత్యుత్తమ పర్సంటైల్ మార్కులతో పాటు 48మంది విద్యార్థులకు 98 పర్సంటైల్‌కిపైగా, 76మందికి 95పర్సంటైల్‌కిపైగా, 167 మంది విద్యార్థులు 90పర్సంటైల్‌కిపైగా మార్కులు సాధించి జయకేతనం ఎగురవేశారని తెలిపారు. విద్యార్థులను డీన్లు కేఎల్‌జీ ప్రసాద్, రామమోహన్‌రావు, సంపత్‌కుమార్, అధ్యాపకులు అభినందించారు.

● **ఆకాష్ విద్యార్థుల ప్రతిభ:** తిరుపతికి చెందిన ఆకాష్-బైజ్యూస్ విద్యాసంస్థల విద్యార్థులు ఆర్.రిత్విక్ 99.34 పర్సంటైల్, కె.జయచంద్రారెడ్డి 99.11, ఎం.శివచరణ్ 98.69 మార్కులతో ప్రతిభచాటారని సీనియర్ అకడమిక్ డైరెక్టర్ సీహెచ్ విజయ్‌కుమార్, రీజనల్ సేల్స్ హెడ్ ఎం.భరత్‌కుమార్ పేర్కొన్నారు. 20మందికిపైగా విద్యార్థులు 91శాతానికిపైగా మార్కులు సాధించారని తెలిపారు. విద్యార్థులను బ్రాంచ్ హెడ్ నరసింహులు, ఇంజినీరింగ్ అకడమిక్ హెడ్ శ్రీరామ రమేష్, గీతం విద్యాసంస్థల ఛైర్మన్ డాక్టర్ తమ్మినేని వెంకటేశ్వర్లు అభినందించారు.



● **నారాయణ విద్యార్థుల విజయభేరి :** తిరుపతికి చెందిన నారాయణ విద్యాసంస్థల విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలుసాధించి జయభేరి మోగించారని డీజీఎం కొండలరావు పేర్కొన్నారు. తమ విద్యార్థులు శ్రీవివస్వత్ 99.9 పర్సంటైల్, వివేకానందరెడ్డి 99.8, దినేష్ ప్రసాద్‌రెడ్డి 99.8, జస్వంత్ 99.8, సాయిప్రసన్న 99.8, చెంచు తన్మయి కృష్ణ 99.8, పుష్కర్ 99.8 మార్కులతో సత్తాచాటగా.. 16మంది విద్యార్థులు 99పర్సంటైల్‌కిపైగా, 25మంది 98పర్సంటైల్‌కిపైగా, 65 మంది 95కిపైగా, 125మంది విద్యార్థులకు 90పర్సంటైల్‌కిపైగా మార్కులు సాధించారని తెలిపారు. విద్యార్థులను డీన్లు, ప్రిన్సిపాళ్లు, అధ్యాపకులు అభినందించారు.



అమరావతి ఐఐటీ అకాడమీ విద్యార్థుల విజయదుందుభి : ఏఐఆర్ బైపాస్ రోడ్డులోని అమరావతి ఐఐటీ-జేఈఈ అకాడమీ విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించి జయకేతనం ఎగురవేశారని ఛైర్మన్ బీవీ కృష్ణారెడ్డి పేర్కొన్నారు. తమ విద్యార్థులు టి.మణిదీప్‌రెడ్డి 99.56పర్సంటైల్, పరంధామన్ గోకుల్ 99.45, కె.దర్శిని, గణపతిశెట్టి నిశ్చల 99.42, పి.తేజస్ 99.33, షేక్ హాఫీఫా 99.31, చెరుకు కీర్తికేయన్‌రెడ్డి 98.11, ఎల్.చందు 98.06వంటి అత్యుత్తమ మార్కులతో పాటు 28మందికిపైగా విద్యార్థులు 95 పర్సంటైల్‌కిపైగా మార్కులు పొంది సత్తాచారని తెలిపారు. విద్యార్థులను ఆయనతోపాటు డైరెక్టర్ అభినందించారు.



తిరుపతి

దొంగ ఓట్ల నుంచి తిరుపతిని కాపాడు తల్లీ!

తిరుపతి, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి) : తిరుపతికి మాయనిమచ్చగా నిలిచిన దొంగ ఓట్లు నుంచి కాపాడాలని టీడీపీ నేతలు కోరారు. జాతీయ స్థాయిలో సంచలనం సృష్టించిన తిరుపతిలో దొంగ ఓట్లపై నిరసనగా మంగళవారం తాతయ్యగుంట గంగమ్మ ఆలయంలో టీడీపీ శ్రేణులు వేయికళ్ల దుత్తలతో వేడుకున్నారు. మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, తుడా మాజీ చైర్మన్ నరసింహ యాదవ్ మాట్లాడుతూ వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత జరిగిన కార్పొరేషన్ ఎన్నికలు మొదలుకుని లోక్‌సభ ఉప ఎన్నికలు, టౌన్ బ్యాంకు ఎన్నికల వరకు దొంగ ఓట్లపైనే గెలిచారని ఆరోపించారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లోనూ దొంగ ఓట్లతో గెలవాలని చూశారని, విద్యావంతులు తగిన బుద్ధి చెప్పారని అన్నారు. ఇలాంటి దుర్మార్గపు చర్యలకు స్వస్తి పలికేలా గంగమ్మ తల్లి కాపుకాయాలని కోరారు. సూత్రధారులను పోటీకి అనర్హులుగా ప్రకటించాలని డిమాండు చేశారు. అదే విధంగా తిరుపతి గంగ జాతరను రాజకీయం చేశారని, కానుకలను ఖాళీ చేసి ఆలయాన్ని అప్రతిష్ట పాలు చేశారని విమర్శించారు. రాబోయే జాతరకు కూడా ఆలయ నిర్మాణాన్ని పూర్తి చేయలేరని, భక్తులకు ఇబ్బందులు తప్పవని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు మబ్బు దేవనారాయణ రెడ్డి, ఆర్సీ మునికృష్ణ, ఊకా విజయకుమార్, పులుగోరు మురళీకృష్ణారెడ్డి, శ్రీధర్ వర్మ, దంపూరి భాస్కర్ యాదవ్, డాక్టర్ కోడూరు బాలసుబ్రమణ్యం, జేబీ శ్రీనివాస్, ఊట్ల సురేంద్ర నాయుడు, చినబాబు, మహేష్ యాదవ్, కంకణాల రజనీకాంత్, రుద్రకోటి సదాశివం, కృష్ణ యాదవ్, ఆనంద్ యాదవ్, కరాటే చంద్ర, శంకర్, సుబ్బు యాదవ్, రాజయ్య, బ్యాంకు శాంతమ్మ, భారతి, రేవతి తదితరులు పాల్గొన్నారు.

గంగమ్మ గుడిలో టీడీపీ నాయకుల వేడుకోలు



అధికారులూ.. వైసీపీ వలలో పడకండి : జనసేన

తిరుపతి(తిలక్‌రోడ్), ఫిబ్రవరి 13: వైసీపీ వలలో పడవద్దని, ప్రలోభాలకు లోనైతే సస్పెండ్ కాక తప్పదని జనసేన నగర అధ్యక్షుడు రాజారెడ్డి అధికారులను హెచ్చరించారు. మంగళవారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ తిరుపతి పార్లమెంటు ఉప ఎన్నికల్లో అధికారం కోసం వైసీపీ నేతలు అడ్డదారులు తొక్కి, ఉద్యోగులను ప్రలోభాలకు గురిచేశారని, ఇప్పుడు ఆ శిక్ష వారు అనుభవిస్తున్నారని అన్నారు. ఉద్యోగాలు కోల్పోయే పరిస్థితి నెలకొందన్నారు. ప్రలోభాలకు గురికాకుండా రానున్న ఎన్నికలను నిర్వహించాలని కోరారు. రాష్ట్రంలో రానున్నది జనసేన, టీడీపీ ఉమ్మడి ప్రభుత్వమని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు దినేష్ జైన్, రాజేష్ ఆచారి, హిమవంత్, కిషోర్, పవన్, మనోజ్, సాయి దేవ్, మణి తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల బకాయిలను వెంటనే చెల్లించాలి



నిరసన తెలుపుతున్న ఉద్యోగ సంఘాల నేతలు

తిరుపతి సిటీ, ఫిబ్రవరి 13 : రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులకు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చి, వారి రావాల్సిన బకాయిలను తక్షణమే చెల్లించాలని ఏపీఎన్జీవోస్ జిల్లా సహాధ్యక్షుడు నైనార్ వరప్రసాద్ కోరారు. ప్రభుత్వ ఉద్యోగుల హక్కుల సాధన కోసం ఆయన రుయాస్పత్రి ముందు ఏపీఎన్జీవోస్ నేతలతో కలిసి మంగళవారం నిరసన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే ఉద్యోగులకు రూ.2,300 కోట్లు బకాయి పడిందని తెలిపారు. ఉద్యోగులకు ఇచ్చిన హామీల్లో ఏ ఒక్కదానిపైనా స్పష్టత ఇవ్వలేదన్నారు. కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేస్తున్నట్లు ప్రకటించినా అమలు కాలేదన్నారు. అవుట్‌సోర్సింగ్ విధానాన్ని రద్దుచేసి, కాంట్రాక్టు ఉద్యోగులుగా గుర్తిస్తామన్న హామీని నెరవేర్చాలన్నారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ఏపీఎన్జీవోస్ ఆధ్వర్యంలో గురువారం నుంచి వినూత్న రీతిలో నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నర్సింగ్ సూపరింటెండెంట్ గ్రేడ్-1 అరుణ, నర్సింగ్ అసోసియేషన్ సభ్యులు మల్లీశ్వరి, తులసమ్మ, సిబ్బంది చిట్టిబాబు, నాగరాజు, సుబ్రహ్మణ్యం, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

ఆడుదాం ఆంధ్రాలో జిల్లా జట్లకు రెండోస్థానం



బ్యాడ్మింటన్, కబడ్డీ జట్లు

తిరుపతి(కొర్లగుంట), ఫిబ్రవరి 13 : విశాఖపట్నం వేదికగా మంగళవారం జరిగిన ఆడుదాం ఆంధ్రా తుదిపోరులో జిల్లాకు చెందిన రెండు జట్లకు రెండోస్థానం దక్కింది. తిరుపతి జిల్లా తరఫున తుదిపోరుకు బ్యాడ్మింటన్, కబడ్డీ జట్లు ప్రాతినిథ్యం వహించాయి. మెన్ బ్యాడ్మింటన్ టీమ్ ఏలూరు జట్టుతో తలపడగా రన్నర్ ఎతో సరిపెట్టుకోవాల్సి వచ్చింది. పురుష కబడ్డీ జట్టు బాపట్లతో హోరాహోరీ పోటీ పడగా చివరికి ఓటమి పాలైంది. బ్యాడ్మింటన్ రూ.లక్ష, కబడ్డీ జట్టు రూ.3లక్షలు నగదు బహుమతి అందుకున్నాయి. క్రీడాశాఖ మంత్రి రోజా క్రీడాకారులను అభినందించారు. ఇదేస్ఫూర్తితో జాతీయస్థాయిలో రాణించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా క్రీడాధికారి సయ్యద్‌సాహెబ్, శాప్ కోచ్ ఆది పాల్గొన్నారు.

ఆర్టీసీ సిబ్బంది రక్తదానం



రక్తదానం చేసిన సిబ్బందికి సర్టిఫికెట్ అందజేస్తున్న చెంగల్‌రెడ్డి

తిరుపతి(కొర్లగుంట), ఫిబ్రవరి 13: రోడ్డు భద్రతా మాసోత్సవాలలో భాగంగా ఆర్టీసీ అలిపిరి డిపోకు చెందిన పలువురు ఉద్యోగులు మంగళవారం రక్తదానం చేశారు. డిపో ఆవరణలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమాన్ని ప్రజారవాణాధికారి చెంగల్‌రెడ్డి ప్రారంభించారు. రక్తదానం చేసిన అధికారులు, కండక్టర్లు, డ్రైవర్లు, సెక్యూరిటీ, గ్యారేజీ సిబ్బంది తదితరులకు సర్టిఫికెట్స్ అందజేశారు. ఈ కార్యక్రమంలో డిపో మేనేజర్ హరిబాబు, అసిస్టెంట్ మేనేజర్ పుష్పలత, అసిస్టెంట్ మెకానికల్ ఇంజనీర్ ప్రభాకర్, టి.రాము, గోపాల్, నాగేశ్వరరావు, నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

ఆటోనగర్ బాధితులకు జనసేన మద్దతు



తిరుపతి (కొర్లగుంట), ఫిబ్రవరి 13 : ఆటోనగర్‌లో శ్రీవేంకటేశ్వర ఫ్యాబ్రికేటర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కొనసాగుతున్న నిరసనకు జనసేన పట్టణాధ్యక్షుడు రాజారెడ్డి బృందం మంగళవారం మద్దతు తెలిపింది. రాజారెడ్డి మాట్లాడుతూ నగరంలో ట్రాఫిక్ సమస్యను తొలగించడానికి 1998లో వెల్డింగ్ కార్మికులకు ఆటోనగర్‌లో మూడున్నర ఎకరం స్థలం కేటాయించిందన్నారు. ప్రస్తుతం ఆ భూముల ధరలు పెరగడంతో షాపింగ్ కాంప్లెక్స్ పేరుతో వారి కడుపుకొట్టాలని చూస్తుండడం దారుణమన్నారు. వారికి ఆ స్థలం పూర్తిగా అప్పగించే వరకు మద్దతుగా నిలుస్తామని స్పష్టం చేశారు.

డాక్టరేట్ ప్రదానం



సురేఖ

తిరుపతి సిటీ, ఫిబ్రవరి 13 : స్విమ్స్ యూనివర్సిటీ బయోటెక్నాలజీ విభాగంలో పరిశోధక విద్యార్థిని కటారు సురేఖకు డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ(పీహెచ్‌డీ) పట్టాను ప్రదానం చేసినట్లు మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రామ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అలైడ్ సైన్సెస్ విభాగం కింద ఇన్ విట్రో జనరేషన్ ఆఫ్ మిసాన్ జియల్ సెల్స్ ఫ్రమ్ హ్యూమన్ హెమటోపోయిటిక్ స్టెమ్‌సెల్స్ అనే అంశంపై బయోటెక్నాలజీ విభాగం చీఫ్ గైడ్ ప్రొఫెసర్ డాక్టర్ పీవీజీకే శర్మ పర్యవేక్షణలో పరిశోధన చేసి, గ్రంథాన్ని యూనివర్సిటీ బోర్డ్ ఆఫ్ ఎగ్జామినేషన్ వారికి సమర్పించినట్లు పేర్కొన్నారు. సురేఖను స్విమ్స్ డైరెక్టర్ డాక్టర్ ఆర్వీ కుమార్, డీన్ డాక్టర్ అల్లాడి మోహన్, ఎంఎస్ డాక్టర్ రామ్, ఆర్ఎంవో కోటిరెడ్డి అభినందించారు.

ప్రైవేట్ పాఠశాలల్లో 25శాతం కోటాకు దరఖాస్తు చేసుకోండి

తిరుపతి(విద్య), ఫిబ్రవరి 13: జిల్లాలోని ప్రైవేట్ అన్ ఎయిడెడ్ పాఠశాలల్లో 2024-25 విద్యాసంవత్సరానికి సంబంధించి విద్యాహక్కు చట్టంలోని 25శాతం కోటా సీట్లకు ఒకటవ తరగతిలో ప్రవేశానికి అర్హులైన విద్యార్థుల తల్లిదండ్రులు దరఖాస్తు చేయాలని డీఈవో డాక్టర్ వి.శేఖర్ పేర్కొన్నారు. అనాథ, హెచ్‌ఐవీ బాధిత పిల్లలు, దివ్యాంగులకు 5శాతం, ఎస్సీలకు 10, ఎస్టీలకు 4, బలహీనవర్గాల(బీసీ, మైనార్టీ, ఓసీ)విద్యార్థులకు 6శాతం సీట్లచొప్పున మొత్తం 25శాతం సీట్లలో ప్రవేశాలు కల్పిస్తామని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో నివసించే బలహీన వర్గాల కుటుంబాల వార్షిక ఆదాయం రూ.1,20,000, పట్టణ ప్రాంతాలకు చెందిన వారికి రూ.1,40,000 ప్రాతిపదికన అర్హులను ఎంపిక చేస్తామని వివరించారు. అర్హులైన విద్యార్థులు ఈ నెల 23 నుంచి మార్చి 14 వరకు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.సీఎస్ఈ.ఏపీ.జీవోవీ.ఇన్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేయాలని తెలిపారు. ఇతర సమాచారం కోసం జిల్లాలోని డీవైఈవో, ఎంఈవోలను సంప్రదించాలని కోరారు. సాంకేతిక సమస్యల పరిష్కారం కోసం 14417 హెల్ప్‌లైన్ నంబరును సంప్రదించాలన్నారు.

దిష్టిబొమ్మ దగ్ధం కేసులో టీఎన్ఎస్ఎఫ్ నేతలకు బెయిల్

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఫిబ్రవరి 13: గతేడాది అక్టోబరు 9వ తేదీన మాజీ సీఎం చంద్రబాబు అరెస్టుకు నిరసనగా ఎస్వీ యూనివర్సిటీలో సీఎం జగన్ దిష్టిబొమ్మను తెలుగు యువత నాయకులు దగ్ధం చేశారు. తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధులు డాక్టర్ ఎన్. శేషాద్రి నాయుడు, కె.రామ్మోహన్‌పై హత్యాయత్నం కేసు నమోదు చేశారు. 143, 307, 353, 506 సెక్షన్ల ప్రకారం కేసు నమోదు చేశారు. ఐదు నెలలుగా తెలుగు యువత నాయకుల కోసం పోలీసులు గాలించారు. ఈ కేసుపై తిరుపతి అదనపు జిల్లా న్యాయమూర్తి యాంటిస్పెటల్ బెయిల్ మంజూరు చేశారు. ఈ సందర్భంగా వారిని మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, టీడీపీ తిరుపతి పార్లమెంట్ నియోజకవర్గ జిల్లా అధ్యక్షుడు నరసింహయాదవ్, కార్పొరేటర్ ఆర్సీ మునికృష్ణ, నాయకులు శ్రీధర్ వర్మ, కోడూరు బాలసుబ్రమణ్యం, పెరుమాళ్ మధు, భాస్కర్‌యాదవ్, చినబాబు, మోహన్‌రెడ్డి, చంద్ర, జిల్లా లీగల్ సెల్ అధ్యక్షుడు దినకర్ సత్కరించారు.

అన్యాయంపై యువత తిరగబడాలి : ఆర్సీ మునికృష్ణ

సీఎం దిష్టిబొమ్మ దగ్ధం చేస్తే హత్యాయత్నం కేసు పెట్టడం అన్యాయమని టీడీపీ కార్పొరేటర్ ఆర్సీ మునికృష్ణ పేర్కొన్నారు. ఇలాంటి వాటిపై యువత తిరగబడాలని కోరారు. యువతకు ఎన్నికల్లో అనేక హామీలు ఇచ్చిన జగన్ అధికారంలోకి వచ్చాక పూర్తిగా విస్మరించారని విమర్శించారు. ఉద్యోగాల భర్తీ మాట నీటి మూట అయ్యిందన్నారు. వచ్చే ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాలని ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.



టీఎన్ఎస్ఎఫ్ నాయకులకు సత్కరించిన టీడీపీ నాయకులు

రథసప్తమికి కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు

నూతన ఎస్పీ మలికా గర్గ్

తిరుమల, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి) : సూర్యజయంతి సందర్భంగా ఈ నెల 16వ తేదీన తిరుమలలో రథసప్తమికి కట్టుదిట్టమైన భద్ర ఏర్పాట్లు చేస్తామని నూతన ఎస్పీ మలికా గర్గ్ తెలిపారు. ఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం తొలిసారిగా ఆమె మంగళవారం తిరుమల శ్రీవారిని కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. అనంతరం టీటీడీ సీవీఎస్వో నరసింహకిషోర్, స్థానిక పోలీసు అధికారులతో కలిసి మాడవీధులు, గ్యాలరీలు, భక్తులు గ్యాలరీల్లోకి ప్రవేశించే, బయటకు వచ్చే మార్గాలను పరిశీలించారు. అవుటర్ రింగ్ రోడ్డు, కమాండ్ కంట్రోల్ రూంను చూశారు. రథసప్తమికి వచ్చే భక్తులు, వాహనాల సంఖ్య, వాహన సేవల నిర్వహణ, ఎదురయ్యే సమస్యల గురించి సీవీఎస్వో ఎస్పీకి వివరించారు. మలికా గర్గ్ మీడియాతో మాట్లాడుతూ రథసప్తమి రోజు భక్తులకు ఎలాంటి ఇబ్బందీ లేకుండా బందోబస్తు ఏర్పాటు చేస్తామన్నారు. అనంతరం టీటీడీ ఈవో ధర్మారెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు.



ఆలయం ముందు కుటుంబీకులతో మలికా గర్గ్ - రథసప్తమి ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎస్పీ

బోధనలో సాంకేతికత పరిజ్ఞానాన్ని వినియోగించండి

- జిల్లా స్థాయి ఇన్ సర్వీస్ టీచర్ల శిక్షణలో డీఈవో శేఖర్

తిరుపతి(విద్య), ఫిబ్రవరి 13 : టీచర్లు అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుని బోధనలో వినియోగించాలని జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ వి.శేఖర్ పేర్కొన్నారు. న్యూబాలాజీ కాలనీలోని ఎంఎంటీజీ స్కూల్‌లో జిల్లాలోని సహిత, భవిత టీచర్లకు నిర్వహించిన ఇన్ సర్వీస్ ట్యాబ్ ట్రైనింగ్ ఇంపార్టెంట్ ఇన్‌క్లూజివ్ ఆంధ్రవిజన్-2కే25 కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వచ్చిన డీఈవో మాట్లాడుతూ ప్రత్యేక అవసరాలున్న పిల్లలు విద్యాపరంగా రాణించేందుకు ఈ ట్యాబ్లు ఎంతగానో ఉపయోగపడుతాయని తెలిపారు. యాప్‌లలోని విద్యాపరమైన వీడియోలను ప్రత్యక్షంగా చూడడం, వినడం ద్వారా చదువుపట్ల ఆసక్తి పెంచుకుంటారని పేర్కొన్నారు. కోఆర్డినేటర్ చంద్రశేఖర్‌రెడ్డి, ప్రణాళిక విద్య కోఆర్డినేటర్ రామచంద్రారెడ్డి మాట్లాడారు. సమగ్ర శిక్ష జిల్లా అధికారి సురేష్, రిసోర్స్‌పర్సన్లు బీఎన్ నాయుడు, పి.సునీల్, రాష్ట్ర అబ్జర్వర్ డాక్టర్ వై.నరసింహ, కన్సల్టెంట్ డాక్టర్ ఎన్.అమ్మినాయుడు, అసిస్టెంట్ కోఆర్డినేటర్, టీచర్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఈవో శేఖర్

వెంకన్న సేవలో జస్టిస్ నాగార్జునరెడ్డి



ఎల్వీ సుబ్రహ్మణ్యం - జస్టిస్ నాగార్జునరెడ్డి

తిరుమల, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): ఏపీ విద్యుత్ నియంత్రణ మండలి(ఏపీఈఆర్సీ) చైర్మన్ జస్టిస్ నాగార్జునరెడ్డి మంగళవారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. వేకువజాము జరిగిన అర్చనసేవలో ఆయన కుటుంబ సమేతంగా పాల్గొని శ్రీవారిని దర్శించుకున్నారు. అలాగే ఏపీ ప్రభుత్వ మాజీ ప్రధాన కార్యదర్శి ఎల్వీ సుబ్రహ్మణ్యం కూడా శ్రీవారిని దర్శించుకున్నారు. వీరికి ఆలయాధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి, లడ్డూప్రసాదాలు అందజేశారు.

ఘనంగా సాయిశ్రీ స్కూల్ వార్షికోత్సవం



తిరుపతి(విద్య), ఫిబ్రవరి 13: స్థానిక మహతి ఆడిటోరియంలో శ్రీసాయి ఇంగ్లిషు మీడియం స్కూల్ 18వ వార్షికోత్సం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా వచ్చిన ఏపీ ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్(అప్సా) రాష్ట్ర అధ్యక్షుడు వి.సుబ్రమణ్యంరాజు, కార్యదర్శి రమణ మాట్లాడుతూ విద్యార్థులు చదవుతో పాటు క్రమశిక్షణ అలవర్చుకుని ఉన్నత పౌరులుగా ఎదగాలని ఆకాంక్షించారు. కరస్పాండెంట్ చంద్రశేఖర్ మాట్లాడుతూ విద్యార్థులకు ఒత్తిడిలేని విద్యను అందిస్తూ వారి సర్వతోముఖాభివృద్ధికి కృషిచేస్తున్నామన్నారు. వివిధ పోటీల్లో ప్రతిభచాటిన వారికి సర్టిఫికెట్లు, బహుమతులు ప్రదానం చేశారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

పద్మావతి వర్సిటీ వీసీ నేపాల్‌కు పయనం

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఫిబ్రవరి 13 : పద్మావతి మహిళా యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ భారతి నేపాల్‌కు పయనమయ్యారు. ఈ నెల 15 నుంచి 17వ తేదీ వరకూ ఖాట్మండ్‌లో నిర్వహించనున్న ఎడ్యుకేషన్ సమ్మిట్‌లో ఆమె పాల్గొంటారు. వివిధ సంస్థలతో ఒప్పందాలు, బోధన, పరిశోధన రంగాల్లో పరస్పర సహకారం, విదేశీ విద్యార్థులు పద్మావతి వర్సిటీలో చదువుకోవడానికి అవకాశాలు కల్పించడం కోసం ఈ కార్యక్రమానికి హాజరవుతున్నట్లు చెప్పారు. తిరుపతి నుంచి మంగళవారం ఆమె పయనమయ్యారు.

రానున్న ఎన్నికల్లో వైసీపీకి తగిన శాస్తి : ఆర్కాట్ కృష్ణప్రసాద్



తిరుపతి(తిలక్‌రోడ్), ఫిబ్రవరి 13 : రానున్న ఎన్నికల్లో బలిజలు వైసీపీకి తగిన గుణపాఠం చెబుతారని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఆర్కాట్ కృష్ణప్రసాద్ అన్నారు. మంగళవారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ వైసీపీ గ్రేటర్ రాయలసీమలో బలిజలకు ఒక్క సీటు కూడా కేటాయించకపోవడం దారుణమన్నారు. గత ఎన్నికల్లో కేవలం రెండు సీట్లను మాత్రమే కేటాయించారన్నారు. ప్రస్తుతం ఈ రెండు సీట్లను కూడా తమ సామాజిక వర్గానికే కట్టబెట్టడం మంచి పద్ధతి కాదని పేర్కొన్నారు. ఈ సమావేశంలో బలిజ సంఘం నాయకులు కృష్ణయ్య, సురేష్, రాజేంద్ర, రామారావు, రఘు తదితరులు పాల్గొన్నారు.

మఠం వసూల్‌రాజాలపై చర్యలు తీసుకోవాలి

తిరుపతి(కొర్లగుంట), ఫిబ్రవరి 13: నగరంలోని మఠం భూముల్లో షెడ్లు వేసుకుని అద్దె వసూలు చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని సీపీఐ జిల్లా కార్యదర్శి పి.మురళి డిమాండ్ చేశారు. శ్రీనివాస కల్యాణ మండపాల వద్ద చిరుచాపల వ్యాపారులకు జరిగిన నష్టాన్ని మఠం అధికారులు వెంటనే చెల్లించాలన్నారు. మంగళవారం వీధి విక్రయదారులసంఘం ఆధ్వర్యంలో కృష్ణాపురం ఠాణా నుంచి హథీరాంజీమఠం వరకు ర్యాలీగా చేరుకుని ధర్నా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎం.కె.నాయుడు కాలనీలో లీజు పేరుతో హథీరాంజీమఠం భూములను కోట్లాది రూపాయలకు విక్రయిస్తూ విల్లాస్ నిర్మిస్తున్నారన్నారు. శ్రీనివాస కల్యాణ మండపాల వద్ద మఠం భూముల్లో షెడ్లు నిర్మించుకుని కొంతమంది బాడుగలు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. పోలీసు యంత్రాంగాన్ని అడ్డుపెట్టుకుని చిరు చేపల వ్యాపారులను ఇబ్బందిపెట్టడం అన్యాయమన్నారు. పేదల జోలికి వస్తే హథీరాంజీ మఠం కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. అనంతరం హథీరాంజీ మఠం కార్యాలయంలో లా అధికారికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పెంచలయ్య, విశ్వనాథ్, చంద్రశేఖర్‌రెడ్డి, శ్రీరాములు, నగర కార్యదర్శి ఎన్.డి.రవి తదితరులు పాల్గొన్నారు.



మఠం కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న సీపీఐ నేతలు

శ్రీవారి హుండీ ఆదాయం రూ.5.48 కోట్లు

తిరుమల, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): శ్రీవారి హుండీ ఆదాయం భారీగా లభించింది. ఆదివారం ఉదయంనుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ సోమవారం లెక్కించింది. రూ.5.48 కోట్లు లభించినట్టు టీటీడీ మంగళవారం ఉదయం ప్రకటించింది. ఇక, సోమవారం 69,314 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. 25,165 మంది తలనీలాలు సమర్పించారు.

నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

తిరుపతి(కలెక్టరేట్), ఫిబ్రవరి 13: జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని, నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని కలెక్టర్, జిల్లా రోడ్డు భద్రత కమిటీ చైర్మన్ లక్ష్మీశా హెచ్చరించారు. మంగళవారం కలెక్టరేట్‌లో రవాణా శాఖ, ఆర్‌అండ్‌బీ, నేషనల్ హైవే, వైద్యశాఖ అధికారులతో ఆయన సమావేశమయ్యారు. రోడ్డు ప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, జరిగితే తీసుకోవాల్సిన చర్యల గురించి చర్చించి, పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా రవాణాశాఖాధికారి ఆదినారాయణరెడ్డి, రాష్ట్ర రవాణా శాఖ కమిటీ మెంబర్ సునీల్ చక్రవర్తి, మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ సుబ్రహ్మణ్యం, జిల్లా వైద్యశాఖాధికారి ఎం.శ్రీహరి పాల్గొన్నారు.

ఆలయాన్ని రాజకీయాలకు వాడుకోవడం బాధాకరం

తిరుపతి(తిలక్‌రోడ్), ఫిబ్రవరి 13: తాతయ్యగుంట గంగమ్మ ఆలయాన్ని రాజకీయాలకు వాడుకోవడం బాధాకరమని గంగమ్మ ఆలయ మాజీ చైర్మన్ కట్టా గోపి యాదవ్ హితవు పలికారు. మంగళవారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ టీడీపీ నాయకుడు చేస్తున్న శంఖారావం కార్యక్రమానికి సంబంధించి ఆలయంలో పార్టీ నినాదాలు చేయడాన్ని తప్పుబట్టారు. గంగమ్మ ఆలయంలో తప్పు చేసిన వారు నాశనమైపోతారని శాపనార్థాలు పెట్టారు. ఈ విషయంపై ఎస్పీకి ఫిర్యాదు చేస్తామని తెలిపారు. ఆలయ మాజీ బోర్డు మెంబర్లు పాల్గొన్నారు.

ఆసరా సభలో మహిళల అవస్థలు



సరిపడా టెంట్లు వేయకపోవడంతో ఎండలోనే నిల్చున్న మహిళలు

వాకాడు, ఫిబ్రవరి 13: వాకాడు మండల పరిషత్ కార్యాలయ ఆవరణంలో మంగళవారం జగనన్న ఆసరా కార్యక్రమం జరిగింది. సభకు మహిళలను అధికంగా తీసుకురావాలని వెలుగు ఏరియా కోఆర్డినేటర్, సీసీలను ఆదేశించారు. దీంతో మహిళలపై ఒత్తిడి తెచ్చి సుమారు మూడు వేలకు పైగా వచ్చేలా చేశారు. అయితే సరిపడా టెంట్లు వేయకపోవడంతో 2వేల మందికి పైగా మహిళలు కూర్చోడానికి కుర్చీలు లేక ఎండలో రెండున్నర గంటల పాటు తీవ్ర అవస్థలు పడ్డారు. పలువురికి మధ్యాహ్నం ఆహారం కూడా దొరక్కపోవడంతో పస్తులు ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. బలవంతంగా సభకు తీసుకొచ్చిన తమకు భోజన వసతులు కూడా ఏర్పాటు చేయలేని ప్రభుత్వానికి మహిళా సాధికారిత గురించి మాట్లాడే హక్కులేదంటూ కొందరు విమర్శలు గుప్పించారు. కాగా, మండలంలో 621 గ్రూపులకు సంబంధించి 6,068 మంది మహిళలకు రూ.4.15 కోట్ల నమూనా చెక్కును ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్ అందించారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో ఛైర్మన్ కొడవలూరు భక్తవత్సల్‌రెడ్డి, జడ్పీటీసీ రౌతు రామకృష్ణ, అజిత్‌కుమార్‌రెడ్డి, నాగభూషణమ్మ తదితరులు పాల్గొన్నారు.

వైసీపీకి వలంటీర్లు విధేయులై ఉండాలి: మేరిగ



వలంటీర్ల సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్

వాకాడు, ఫిబ్రవరి 13: వలంటీర్లు వైసీపీ విధేయులే ఉండాలని గూడూరు నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జి, ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్ పాల్గొన్నారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో వలంటీర్ల పరిచయ వేదిక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మురళీధర్ మాట్లాడుతూ ఎన్నికల్లో వైసీపీ తరపున పోటీచేసే అభ్యర్థుల విజయానికి వలంటీర్లు కృషి చేయాలన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకువెళ్లి ఓటర్లకు వివరించాలని సూచించారు. కార్యక్రమంలో సింగిల్ విండో ఛైర్మన్ కొడవలూరు భక్తవత్సల్‌రెడ్డి, జడ్పీటీసీ రౌతు రామకృష్ణ, దువ్వూరు అజిత్‌కుమార్‌రెడ్డి, నాగభూషణమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఉమ్మడి అభ్యర్థుల విజయానికి కృషి



సమావేశంలో టీడీపీ, జనసేన నాయకులు

చిల్లకూరు, ఫిబ్రవరి 13: రానున్న ఎన్నికల్లో టీడీపీ, జనసేన కలిసికట్టుగా పనిచేస్తూ ఉమ్మడి అభ్యర్థుల విజయానికి కృషి చేయాలని మాజీ ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్, జనసేన నాయకులు అన్నారు. మంగళవారం మండలంలోని ముత్యాలపాడు గ్రామంలో టీడీపీ, జనసేన నాయకుల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో రాష్ట్రంలో అరాచక పాలన సాగిస్తున్న వైసీపీ ప్రభుత్వాన్ని గద్దె దించి, ప్రజా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు ప్రతిఒక్కరూ కృషిచేయాలన్నారు. వైసీపీ పాలనలో అన్ని వర్గాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. రాష్ట్రాభివృద్ధి, ప్రజాసంక్షేమాన్ని గాలికి వదిలి నియంత పాలన సాగిస్తున్న జగన్‌కు బుద్ధి చెప్పాలన్నారు. కార్యక్రమంలో సుందరరామిరెడ్డి, తీగల చంద్రశేఖర్, కొట్టి వెంకటేశ్వర్లు, ఇంద్రవర్ధన్, నాగార్జున, రాజశేఖర్, సనత్‌కుమార్, అవినాష్, శంకర్, ఓకాంర్, విజయ్, సాయి, కృష్ణ, మురళీరెడ్డి, వెంకటేశ్వర్లురెడ్డి, వరదారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చేతివృత్తిదారుల కడుపుకొట్టిన వైసీపీ: పాశం

గూడూరు, ఫిబ్రవరి 13: వైసీపీ ప్రభుత్వం చేతివృత్తిదారుల కడుపుకొట్టిందని మాజీ ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ అన్నారు. మంగళవారం నాయీబ్రాహ్మణులు టీడీపీలో చేరడంతో వారికి పార్టీ కండువాలను కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా సునీల్‌కుమార్ మాట్లాడుతూ టీడీపీ అధికారంలో ఉన్న సమయంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నాయీబ్రాహ్మణులకు ఆదరణ పథకం ద్వారా చేయూతనిచ్చారన్నారు. వైసీపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి చేతివృత్తిదారులకు ఎటువంటి సంక్షేమ పథకాలు అమలు చేయలేదన్నారు. చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని, రానున్న ఎన్నికల్లో అందరం కలిసికట్టుగా పనిచేసి టీడీపీని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నెలబల్లి భాస్కర్‌రెడ్డి, పులిమి శ్రీనివాసులు, వెంకటేశ్వర్లురాజు, బిల్లు చెంచురామయ్య, ఈదర శ్రీనివాసులు, అబ్దుల్ రహీమ్, భాస్కర్, శివయ్య, గురునాధం, గోపాల్, ధనుంజయ తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేట్ పాఠశాలల్లో 25శాతం కోటాకు దరఖాస్తు చేసుకోండి

తిరుపతి(విద్య), ఫిబ్రవరి 13: జిల్లాలోని ప్రైవేట్ అన్ ఎయిడెడ్ పాఠశాలల్లో 2024-25 విద్యాసంవత్సరానికి సంబంధించి విద్యాహక్కు చట్టంలోని 25శాతం కోటా సీట్లకు ఒకటవ తరగతిలో ప్రవేశానికి అర్హులైన విద్యార్థుల తల్లిదండ్రులు దరఖాస్తు చేయాలని డీఈవో డాక్టర్ వి.శేఖర్ పేర్కొన్నారు. అనాథ, హెచ్ఐవీ బాధిత పిల్లలు, దివ్యాంగులకు 5శాతం, ఎస్సీలకు 10, ఎస్టీలకు 4, బలహీనవర్గాల(బీసీ, మైనార్టీ, ఓసీ)విద్యార్థులకు 6శాతం సీట్ల చొప్పున మొత్తం 25శాతం సీట్లలో ప్రవేశాలు కల్పిస్తామని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో నివసించే బలహీన వర్గాల కుటుంబాల వార్షిక ఆదాయం రూ.1,20,000, పట్టణ ప్రాంతాలకు చెందిన వారికి రూ.1,40,000 ప్రాతిపదికన అర్హులను ఎంపిక చేస్తామని వివరించారు. అర్హులైన విద్యార్థులు ఈ నెల 23 నుంచి మార్చి 14 వరకు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.సీఎస్ఈ.ఏపీ.జీవోవీ.ఇన్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేయాలని తెలిపారు.

గూడూరు
సూళ్లూరుపేట/వెంకటగిరి

ఎస్ఈబీ పోలీసులపై దాడి కేసులో ఏడుగురి అరెస్టు

వాకాడు, ఫిబ్రవరి 13: ఎస్ఈబీ పోలీసులపై దాడిచేసిన ఏడుగురిని పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. మండలంలోని దుగరాజపట్నం పంచాయతీ కొండూరుపాళెం వద్ద ఈనెల 11వ తేదీన కోడిపందేలు ఆపమన్నందుకు ఎస్ఈబీ ఎస్ఐ మరో ఇద్దరు సిబ్బందిపై నిర్వాహకులు దాడిచేసిన విషయం తెలిసిందే. ఈ కేసులో ఏడుగురు నిందితులను అరెస్టు చేసి కోర్టుకు రిమాండ్‌కు పంపినట్లు సీఐ హరికృష్ణ తెలిపారు.

చెంగాళమ్మకు వెండి గిన్నెల విరాళం



వెండి గిన్నెలను ఈవోకు అందజేస్తున్న మల్లికార్జున రావు

సూళ్లూరుపేట, ఫిబ్రవరి 13: చెంగాళమ్మ పరమేశ్వరికి కావలికి చెందిన భక్తుడు మల్లికార్జున రావు మంగళవారం 520 గ్రాముల బరువున్న రెండు వెండి తీర్థం గిన్నెలను ఈవో వెంకటేశ్వర్లుకు విరాళంగా అందజేశారు. కార్యక్రమంలో పాలక మండలి సభ్యుడు ముప్పాళ్ల చంద్రశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాళంగిని కొల్లగొడుతున్నారు..!

- గుట్టలు గుట్టలుగా ఇసుక డంప్‌లు
- చోద్యం చూస్తున్న అధికారులు

సూళ్లూరుపేట, ఫిబ్రవరి 13: కాళంగి నది పరివాహక ప్రాంతంలో ఇసుక దందా కొనసాగుతోంది. అక్రమార్కులే పరమాదిగా నిబంధనలకు తూట్లు పొడుస్తూ ప్రకృతి వనరును కొల్లగొడుతున్నారు. రైతుల వరప్రసాదిని అయిన కాళంగి నది నుంచి నిత్యం ఇసుక తరలిపోతోంది. సూళ్లూరుపేట మండలంలోని ఇలుపూరు, మంగళంపాడు ప్రాంతాల వద్ద కాళంగి నదిలో ఇసుకను అక్రమంగా తవ్వి రవాణా చేస్తున్నారు. ఈ గ్రామాల్లో ఎక్కడ చూసిన ఇసుక గుట్టలు, గుట్టలుగా డంపింగ్ చేసుకొని ట్రాక్టర్ల ద్వారా రియల్ ఎస్టేట్ నిర్మాణాలకు, పలు కంపెనీలకు తరలించి జేబులు నింపుకొంటున్నారు. పట్టపగలే.. పోలీసు, రెవెన్యూ అధికారుల ఎదురుగానే అక్రమ రవాణా సాగుతున్నా పట్టించుకోవడంలేదు. తోంది. అధికారులు సైతం మకేం తెలియదన్నట్లుగా ఉంటున్నారు. గ్రామాలను ఆనుకొని కాళంగి నది ఉండడంతో వీరి అక్రమ రవాణాకు కలిసిచ్చింది. నిత్యం ఎడ్లబండ్లు, ట్రాక్టర్ల ద్వారా పొలాల వద్దకు తరలించి డంపింగ్ చేసుకుంటున్నారు. సూళ్లూరుపేట పట్టణం, శివారు ఉన్న రియల్ ఎస్టేట్ భవంతులకు, భుజ్జినాయుడు కండ్రిగ సమీపంలో ఉన్న పలు కంపెనీలకు ఇసుకను ట్రిప్పుల లెక్కన తరలించి లక్షలాది రూపాయలు ఆర్జిస్తున్నారు. సామాన్యుడికి చిన్న పనికోసం ఇసుక అవసరమైనా ప్రభుత్వం కేటాయించిన రీచ్‌ల ద్వారానే తరలించాలి. కానీ అధికార పార్టీ నాయకులు అండదండలు ఉంటే ఎక్కడ నుంచి ఇసుకను తరలించినా అడిగే నాథుడే కరువయ్యాడు. ఇలుపూరు, మంగళంపాడు గ్రామాల్లో రోడ్డు పక్కనే ఉన్న ఇళ్లు, ఖాళీ స్థలాల్లో గుట్టలు గుట్టలుగా ఉన్న ఇసుక డంప్‌లు అధికారులకు కనిపించడం లేదు. సచివాయాల ఎదురుగానే రయ్‌మంటూ ఇసుక ట్రాక్టర్లు పోతున్న సంబంధిత అధికారులకు కనిపించడంలేదు. ఇదంతా అధికార పార్టీ నేతల అండదండలతోనే జరుగుతోందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.



ఇలుపూరు నుంచి కాళంగి నది వెళ్లే దారిలో ఇసుక డంప్‌లు





కాళంగి నుంచి ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్ - డంప్ చేసిన ఇసుకను ట్రాక్టర్‌కు లోడు చేస్తున్న కూలీలు

పర్యాటక కేంద్రంగా ఇరకం దీవి: కలెక్టర్



ఇరకంకుప్పం గ్రామస్తులతో మాట్లాడుతున్న కలెక్టర్ లక్ష్మీ శా

తడ, ఫిబ్రవరి 13: ఇరకందీవిని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటామని కలెక్టర్ లక్ష్మీ శా తెలిపారు. మంగళవారం ఆయన దీవిలోని పోలింగ్ కేంద్రాలు, ఆరోగ్య సబ్ సెంటర్‌ను పరిశీలించారు. పోలింగ్ కేంద్రంలో అవసరమైన వసతుల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇరకందీవిలో పర్యాటక రంగ అభివృద్ధి కోసం సుమారు 80 ఎకరాలను గుర్తించామని, తగిన ప్రణాళికలతో ప్రైవేట్ భాగస్వాములు ముందుకు వస్తే భూములను కేటాయిస్తామని చెప్పారు. ఇరకంకుప్పం గ్రామస్తులు పూడికుప్పంలో నివాస స్థలాలు కేటాయించాలని కోరారని, వారి అభ్యర్థన మేరకు 15 రోజుల్లో ఆ పనులు పూర్తి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నాయుడుపేట డీఎస్పీ శ్రీనివాసరెడ్డి, సూళ్లూరుపేట ఆర్డీవో చంద్రముని, సీఐ మధుబాబు, తహసీల్దారు సయ్యద్ ఇక్బాల్, వివిధశాఖల అధికారులు ఉన్నారు.

ప్రభుత్వాస్పత్రిలో మెరుగైన వైద్య సేవలు

సూళ్లూరుపేట, ఫిబ్రవరి 13: ప్రభుత్వాస్పత్రుల్లోనే మెరుగైన వైద్య సేవలు అందుతాయని, ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ లక్ష్మీ శా అన్నారు. మంగళవారం ఆయన సూళ్లూరుపేట ప్రభుత్వాస్పత్రిని సందర్శించారు. రక్త నిధి కేంద్రం, రక్త పరీక్ష గదులను తనిఖీ చేశారు. రోగులకు అందుతున్న వైద్య సేవల గురించి వైద్యులను అడిగి తెలుసుకొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రైవేట్‌కు దీటుగా ప్రభుత్వాస్పత్రుల్లో వైద్య సేవలు అందించేందుకు అన్ని చర్యలు తీసుకొంటున్నామని, పేదలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అంతకుముందు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఉన్న స్ట్రాంగ్ రూంను, ఉన్నత పాఠశాలలో ఉన్న ఈవీఎం పరిశీలించారు. ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు అన్ని జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఆయన వెంట ఎస్ఐ రహీంరెడ్డి, డీటీలు, చైతన్య, పవన్‌కుమార్, డీసీహెచ్ఎస్ ఆనందమూర్తి, వైద్యులు రమేష్, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

విధ్వంస పాలనకు చరమగీతం పాడాలి



కరపత్రాలను పంపిణీ చేస్తున్న సంధ్యారాణి

గూడూరు, ఫిబ్రవరి 13: రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం సాగిస్తున్న విధ్వంస పాలనకు రానున్న ఎన్నికల్లో ప్రజలు చరమగీతం పాడాలని మాజీ ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ సతీమణి సంధ్యారాణి అన్నారు. మంగళవారం స్థానిక సత్రపువీధిలో బాబు ష్యూరిటీ- భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజల సమస్యలకు పరిష్కారం కావాలంటే చంద్రబాబునాయుడిని ముఖ్యమంత్రిగా చేసుకోవాలన్నారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఎంటువంటి అభివృద్ధి జరగలేదన్నారు. కార్యక్రమంలో పులిమి శ్రీనివాసులు, వాటంబేడు శివకుమార్, భాస్కర్, అమరయ్య, చంద్రమౌళి, భారతి, లక్ష్మి, సుధ తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలతో అన్నీ అనర్థాలే: సీడీపీవో

నాయుడుపేట, ఫిబ్రవరి 13: బాల్య వివాహాలు చేసుకోవడం ద్వారా మానసికంగా, శారీరకంగా అన్ని విధాల అనర్థాలే జరుగుతాయని ఐసీడీఎస్ సీడీపీవో ఉమామహేశ్వరి అన్నారు. నాయుడుపేట ఐసీడీఎస్ కార్యాలయంలో మంగళవారం నాయుడుపేట, పెళ్లకూరు, ఓజిలి మండలాలలోని మహిళా సంరక్షణ కార్యదర్శుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రధానంగా శివరాత్రి రోజున బాల్యవివాహాలు జరుగుతుంటాయని, ముందుగానే వాటిని గుర్తించి ఆయా కుటుంబాల వారికి అవగాహన కల్పించాలన్నారు. యువతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, అసభ్యకర స్పర్శ ప్రవర్తనను పసిగట్టి తల్లిదండ్రులకు లేక ఉపాధ్యాయులకు తెలియజేసేలా వారికి అవగాహన కల్పించాలన్నారు.

రథసప్తమికి కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు

తిరుమల, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): సూర్యజయంతి సందర్భంగా ఈ నెల 16వ తేదీన తిరుమలలో రథసప్తమికి కట్టుదిట్టమైన భద్ర ఏర్పాట్లు చేస్తామని నూతన ఎస్పీ మలిక గర్గ్ తెలిపారు. ఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం తొలిసారిగా ఆమె మంగళవారం తిరుమల శ్రీవారిని కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. అనంతరం టీటీడీ సీవీఎస్వో నరసింహకిషోర్, స్థానిక పోలీసు అధికారులతో కలిసి మాడవీధులు, గ్యాలరీలు, భక్తులు గ్యాలరీల్లోకి ప్రవేశించే, బయటకు వచ్చే మార్గాలను పరిశీలించారు. అవుటర్ రింగ్ రోడ్డు, కమాండ్ కంట్రోల్ రూంను చూశారు. రథసప్తమికి వచ్చే భక్తులు, వాహనాల సంఖ్య, వాహన సేవల నిర్వహణ, ఏటా ఎదురయ్యే సమస్యల గురించి సీవీఎస్వో ఎస్పీకి వివరించారు. మలిక గర్గ్ మీడియాతో మాట్లాడుతూ రథసప్తమి రోజు భక్తులకు ఎలాంటి ఇబ్బందీ లేకుండా బందోబస్తు ఏర్పాటు చేస్తామన్నారు.

చెంగాళమ్మ సేవలో కలెక్టర్

సూళ్లూరుపేట, ఫిబ్రవరి 13: సూళ్లూరుపేటలోని చెంగాళమ్మ పరమేశ్వరిని కలెక్టర్ లక్ష్మీ శా దర్శించుకొన్నారు. ఆయనకు ఈవో వెంకటేశ్వర్లు, పాలక మండలి సభ్యులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి దర్శన ఏర్పాటు చేశారు. అమ్మవారి దర్శనాంతరం వేదపండితులు ఆశీర్వచనం చేసి తీర్థప్రసాదాలు అందజేశారు. కలెక్టర్‌ను ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య ఆలయం వద్ద మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు.

విధుల్లో అలసత్వం వద్దు

తిరుపతి(కలెక్టరేట్), ఫిబ్రవరి 13: జిల్లాలో ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని, ఇందులో ఎలాంటి అలసత్వానికీ తావులేదని కలెక్టర్ లక్ష్మీశా అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో పలు శాఖల సీనియర్ అధికారులు, ఎన్నికల నోడల్ అధికారులతో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ నోడల్ అధికారులు తమ బాధ్యతలను సక్రమంగా నిర్వహించాలన్నారు. ఇందులో ఎలాంటి పొరబాటు జరిగినా చర్యలు తప్పవని హెచ్చరించారు.

కాంగ్రెస్ పార్టీని ఆదరించండి

వరదయ్యపాళెం, ఫిబ్రవరి 13: కాంగ్రెస్ పార్టీని ఆదరించాలని సత్యవేడు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకుడు చల్లదొరై కోరారు. వరదయ్యపాళెం మండల కేంద్రంలో మంగళవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ నుంచి సత్యవేడు నియోజవర్గానికి టిక్కెట్టు ఆశిస్తున్నట్లు తెలిపారు. తాను 1999 జూన్ నుంచి 38 మంది పేద విద్యార్థులకు చైల్డ్‌హోమ్‌ద్వారా సేవలు ప్రారంభించి ప్రస్తుతం 4వేలమందికి పైగా సేవలందిస్తున్నామన్నారు. పార్టీ నాయకులు రాజు, బత్తెయ్య, రవినాయుడు, రమణయ్య, కృష్ణయ్య, లోకనాథం, సుబ్బారావు, ప్రకాష్, భూపాల్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు మొక్కలు నాటాలి

ఏర్పేడు, ఫిబ్రవరి 13: విద్యార్థులు వారి వారి జన్మదినాన్ని పురస్కరించుకుని మొక్కలు నాటి ప్రకృతిని పెంపొందించాలని సేవాక్సిజ్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు కేశవులు సూచించారు. ఏర్పేడు మండలం బత్తినయ్యకాలనీ ప్రాథమిక పాఠశాలలోఉపాధ్యాయులు మురళి, చెంచుబత్తెయ్య అభ్యర్థన మేరకు సేవ్ ఆక్సిజన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంగళవారం మొక్కలు నాటారు.

వైసీపీ మళ్లీ గెలిస్తే రాష్ట్రం రావణ కాష్టమే: కురుగొండ్ల

డక్కిలి, ఫిబ్రవరి 13: వైసీపీ మళ్లీ అధికారంలోకి వస్తే రాష్ట్రం రావణ కాష్టంగా మారుతుందని మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ అన్నారు. మంగళవారం ఆయన మండలంలోని శ్రీపురం గ్రామంలో టీడీపీ నేత అయ్యపరెడ్డి కుమారుడి వివాహ వేడుకల్లో నాల్గొన్నారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ వైసీపీ పాలనలో రాష్ట్రంలో దోపిడీ, దౌర్జన్యాలు పెరిగిపోయాయని, సామాన్యులను సైతం అధికార పార్టీ నేతలు ఇబ్బందులు పెడుతున్నారని విమర్శించారు. జగన్ పాదయాత్రపై యాత్ర - 2 సినిమా తీసిన డైరెక్టర్‌కు దక్షిణ ఊటీగా పేరుగాంచిన హర్సిలీ హిల్స్‌లో భూమి కట్టబెట్టడం సరి కాదన్నారు. రానున్న ఎన్నికల్లో టీడీపీ, జనసేన ఉమ్మడి అభ్యర్థులు విజయకేతనం ఎగురవేడం ఖాయమని కురుగొండ్ల స్పష్టం చేశారు.

వాహనాలు నడిపేటప్పుడు జాగ్రత్తలు పాటించాలి

గూడూరు, ఫిబ్రవరి 13: వాహనాలు నడిపేటప్పుడు జాగ్రత్తలు పాటించాలని ఎంవీఐ సునీల్ అన్నారు. మంగళవారం రవాణశాఖ ఆధ్వర్యంలో ఆటో డ్రైవర్లు, నర్సింగ్ విద్యార్థినులతో కలిసి పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆర్టీసీ డిపోలో సిబ్బందికి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎంవీఐ మాట్లాడుతూ డ్రైవింగ్ చేసే సమయంలో సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనాలు నడపడం ద్వారా ఎక్కువగా ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. వాహనాలు నడిపే సమయంలో సెల్‌ఫోన్‌లో మాట్లాడడం నేరమన్నారు. రూరల్ సీఐ వేణుగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోవడం, అతివేగంగా వాహనాలను నడపడం వల్ల ప్రమాదాలకు లోనవుతున్నారన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ శ్రీహరిబాబు, ఆర్టీసీ డీఎం వెంకటేశ్వర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

టీడీపీ నేతలకు పలువురి నివాళి



మృతదేహంపై టీడీపీ జెండా కప్పుతున్న నేతలు

ఓజిలి, ఫిబ్రవరి 13: టీడీపీ సీనియర్ నాయకుడు కంకణాల రామ్మోహన రావు మృతదేహానికి పలువురు నేతలు నివాళులర్పించారు. సోమవారం విజయవాడలో అనారోగ్యంతో మృతి చెందిన రామ్మోహన రావు మృతదేహాన్ని మంగళవారం ఓజిలికి తీసుకొచ్చారు. టీడీపీ సీనియర్ నాయకుడు వల్లూరు సూర్యప్రకాశరావు చేతుల మీదుగా రామ్మోహనరావు మృతదేహంపై పార్టీ జెండాను కప్పించారు. సూళ్లూరుపేట నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం, రాష్ట్ర ఉపాధ్యక్షుడు పరసా రత్నం, మండల కన్వీనరు గుజ్జలపూడి విజయకుమార్ నాయుడు, నాయకులు వెంకటేశ్వర్లు నాయుడు, ధనుంజయరెడ్డి, గోపాలరెడ్డి, వెంకటసుబ్బయ్య, నిరంజన్, పురుషోత్తంరాజు, కార్తీక్‌రాజు, మల్లిఖార్జునరాజు, వైసీపీ నాయకులు మధుసూదన్‌రెడ్డి, హరినాథరెడ్డి, కోఆప్షన్ సభ్యుడు ఎస్‌కే ఖాదర్‌బాషా, కాంగ్రెస్, బీజేపీ నాయకులు రామ్మోహన్‌రావు మృతదేహానికి నివాళులర్పించారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.5.48 కోట్లు

తిరుమల, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం భారీగా లభించింది. ఆదివారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ సోమవారం లెక్కించింది. రూ.5.48 కోట్లు లభించినట్టు టీటీడీ మంగళవారం ఉదయం ప్రకటించింది. ఇక, సోమవారం 69,314మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు.

హ్యాండ్‌వాష్ ఆరోగ్య విద్యకు మూలస్తంభం



హ్యాండ్‌వాష్ లిక్విడ్ బాటిల్స్‌ను ఉపాధ్యాయులకు అందిస్తున్న హేమత్ రాయల్

ఏర్పేడు, ఫిబ్రవరి 13: హ్యాండ్‌వాష్ చేయడం విద్యార్థుల ఆరోగ్యం, విద్యకు మూలస్తంభమని సంకల్ప ఫౌండేషన్ అధ్యక్షుడు మేడ హేమత్ రాయల్ అన్నారు. విద్యార్థులు- వారి వ్యక్తిగత శుభ్రతలో భాగంగా పాపానాయుడుపేట జడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు మూడు నెలలకు సరిపడే లిక్విడ్ హ్యాండ్ వాష్ ఉచితంగా అందించారు. కార్యక్రమంలో సర్పంచ్ లలిత, మాజీ సర్పంచ్ తంబా సుబ్రహ్మణ్యం, ప్రధానోపాధ్యాయులు జయకుమార్‌రెడ్డి,ఉపాధ్యాయులు,విద్యార్థులు పాల్గొన్నారు.

సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి



కరపత్రాలను విడుదల చేస్తున్న ఏఐటీయూసీ నాయకులు

పుత్తూరు టౌన్, ఫిబ్రవరి 13: కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఈనెల 16వ తేదీన నిర్వహించనున్న బంద్‌ను విజయవంతం చేయాలని ఏఐటీయూసీ ఆధ్వర్యంలో నాయకులు పిలుపునిచ్చారు. మంగళవారం పట్టణంలోని అంబేడ్కర్ భవన్‌లో కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు చంద్రశేఖర్‌రెడ్డి, రాధాకృష్ణ మాట్లాడుతూ బీజేపీ అధికారంలోకి వచ్చాక 44 కార్మిక చట్టాలను రద్దు చేశారని అన్నారు. దేశంలో కార్మికుల హక్కులను కాలరాస్తున్నరని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మిక సమస్యలను పరిష్కారం కోసం జరిగే సమ్మెను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి శ్రీరాములు, జిల్లా సమితి సభ్యులు మహేష్, హైమావతి పాల్గొన్నారు.

పుత్తూరు వార్తలు

భావనారుషి బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ

నారాయణవనం, ఫిబ్రవరి 13: నారాయణవనంలో నెలకొనిన భద్రావతీ సమేత భావనారుషిస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలకు మంగళవారం అంకురార్పణ చేశారు. ఉదయం 6 గంటలకు స్వామివారికి నిత్య పూజా కైంకర్యాల తర్వాత ధ్వజపటం ఊరేగింపు జరిగింది. 7 గంటలకు వార్షిక బ్రహ్మోత్సవాలకు అంకుర్పార్పణ చేశారు.

బీజేపీతోనే దేశాభివృద్ధి

పుత్తూరు టౌన్, ఫిబ్రవరి 13: బీజేపీతోనే దేశాభివృద్ధి సాధ్యమని ఆ పార్టీ మండల అధ్యక్షుడు శ్రీధర్ అన్నారు. మంగళవారం పుత్తూరులో పట్టణంలోని గేటు పుత్తూరులో కేంద్ర ప్రభుత్వ పథకాల గురించి వివరిస్తూ కరపత్రాలను, క్యాలండర్లు అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ చిత్తూరు జిల్లా కార్యదర్శి శంకర్, ప్రధాన కార్యదర్శి మునస్వామి, ఉపాధ్యక్షుడు మధు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వచ్చేది టీడీపీ ప్రభుత్వమే



సమావేశంలో మాట్లాడుతున్న జడ్పీటీసీ సుమన్‌కుమార్

నారాయణవనం, ఫిబ్రవరి 13: వచ్చే ఎన్నికల్లో విజయం సాధించి అధికారం చేపట్టబోయేది టీడీపీ ప్రభుత్వమేనని సుమన్‌కుమార్ స్పష్టం వ్యక్తం చేశారు. మంగళవారం నారాయణవనం మండల కార్యాలయంలో ఎంపీడీవో కృష్ణమూర్తి ఆధ్వర్యంలో సర్వసభ్య సమావేశం జరిగింది. జడ్పీటీసీ సుమన్‌కుమార్ మాట్లాడుతూ సమావేశంలో ప్రోటోకాల్ పాటించాలని, ఇతరులు ఎవరైనా ఉంటే వెళ్లిపోవాలని సూచించారు. దీంతో కొండలచెరువు సర్పంచ్ భూపాల్‌రెడ్డి తండ్రి పయనిరెడ్డి సమావేశం నుంచి వెళ్లిపోతుండగా, ఎంపీపీ దివాకర్ రెడ్డి, పాలమంగళం సర్పంచు సాయిరవి అడ్డుకుంటూ ఆయన తన గ్రామ సమస్యలను చెప్పకోడానికి వచ్చారని చెప్పారు. ఈ క్రమంలో ఎంపీపీ, సర్పంచు, జడ్పీటీసీ మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. ప్రోటోకాల్ పాటించకపోతే ఎందుకు సర్వసభ్య సమావేశం పెట్టారని ఎంపీడీవోను జడ్పీటీసీ ప్రశ్నించారు. ప్రోటోకాల్ లేనివారు బయటకు వెళ్లాలని ఎంపీడీవో చెప్పడంతో పయని రెడ్డి వెళ్లిపోయారు. అనంతరం వివిధ శాఖల వారీగా తమ నివేదికను వెల్లడించారు.

దోచుకున్నది ఒకరైతే... తమ కుటుంబం బలైంది

సత్యవేడు నియోజకవర్గంలో దోచుకున్నది ఒకరైతే, తమ కుటుంబం బలైందని సుమన్‌కుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. దళిత ఎమ్మెల్యేగా ఆదిమూలం అందరికీ తలలో నాలుకలా ఉన్నారని తెలిపారు. రాష్ట్రంలో 30మంది దళిత ఎమ్మెల్యేలు ఉంటే, వారికి మాత్రమే నియోజకవర్గాలు మార్చడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఆదిమూలం ఎవరితోనే గొడవలు పెట్టుకోలేదని, ఎవరి మీదా కేసులు పెట్టి వేధించలేదని తెలిపారు. అలాగే పార్టీలో ఎవరికీ ద్రోహం చేయలేదని, పైగా నియజకవర్గంలో సర్పంచులకు, ఎంపీటీసీలకు ఆర్థిక సాయం అందించినట్లు చెప్పారు. వైసీపీకి విధేయులుగా ఉన్న తమ కుటుంబాన్ని టార్గెట్ చేసి పక్కన పెట్టడం బాధించిందని, తమకు జరిగిన అన్యాయాన్ని నారా లోకేషకు చెప్పుకున్నామని అన్నారు. తాము ఎక్కడా వైసీపీని విమర్శించలేదని, తమ ఆవేదనను అందరూ అర్థం చేసుకోవాలని కోరుతూ సమావేశం జడ్పీటీసీ సుమన్ కుమార్ వెళ్లిపోయారు.


విద్యుత్ అలంకరణ పనులను పరిశీలిస్తున్న ఈవో రామారావు

మహాశివరాత్రి ఏర్పాట్లు వేగవంతం చేయండి

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 13: మహాశివరాత్రి ఏర్పాట్లను వేగవంతం చేయాలని శ్రీకాళహస్తీశ్వరాలయ ఈవో రామారావు సూచించారు. రెండు వారాల్లో ముక్కంటి ఆలయంలో శివరాత్రి ఉత్సవాలు ప్రారంభం కానున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో మంగళవారం ఆలయంలో విద్యుత్ అలంకరణ పనులను చేపట్టగా ఈవో రామారావు అధికారులతో కలిసి పరిశీలించారు.

అరుణా నది ప్రాంతంలో కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

నాగలాపురం, ఫిబ్రవరి 13: మండలంలోని సురుటుపల్లె, కారణి గ్రామాల్లోని అరుణానది ప్రాంతాన్ని తిరుపతి జిల్లా కలెక్టర్ లక్ష్మీశ మంగళవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఇసుక అక్రమ రవాణాపై ఫిర్యాదులు రావడంతో ఆయన నదిని తనిఖీ చేసినట్లు అధికారులు తెలిపారు. తిరుపతి నుంచి తడ వెళ్తుండగా మార్గ మధ్యంలో అరుణానదిని తనిఖీ చేసి వెళ్లారని అధికారులు తెలిపారు.

శివరాత్రి ఉత్సవాల పనులకు టెండర్లు

నాగలాపురం, ఫిబ్రవరి 13: మండల పరిధిలోని సురుటుపల్లె పల్లికొండేశ్వరాలయంలో మహాశివరాత్రి ఉత్సవాలకు సంబంధించి ఈనెల 15న టెండర్లు నిర్వహించనున్నట్లు కార్యనిర్వహణాధికారి రామచంద్రారెడ్డి తెలిపారు. ఫిబ్రవరి 29న ప్రారంభమయ్యే మహాశివరాత్రి ఉత్సవాలు మార్చి నెల 10వ తేదీ ముగుస్తుంది. ఈ 11 రోజులు ఆలయంలో జరిగే నిత్య పూజలకు పూజా సామగ్రి, పుష్పాలంకరణకు పుష్పాలు, నిత్యాన్నదానానికి సరుకులు, కూరగాయలు, ఆలయం వెలుపల చలువ పందిళ్లు, పెయింటింగ్ తదితర పనులకు సీల్డ్ టెండర్లు ఆహ్వానిస్తున్నట్లు ఈవో తెలిపారు. ఈనెల 15వ తేదీ ఉదయం 11గంటలకు దేవాదాయ శాఖాధికారుల సమక్షంలో ఆలయ కార్యాలయంలో సీల్డు టెండరు నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించండి

రేణిగుంట,ఫిబ్రవరి13: వాహనచోదకులు ట్రాఫిక్‌నిబంధనలు పాటించాలని రేణిగుంట అర్బన్ ఎస్‌ఐ అరుణ్‌కుమార్‌రెడ్డి వెల్లడించారు. మంగళవారం సాయంత్రం కరకంబాడి బస్టాండు, దొడ్లమిట్ట బస్టాపు, రేణిగుంట చెక్‌పోస్టు కూడళ్ళు, టౌన్‌పరిధిలో పలు కూడళ్ళలో వాహనాల తనిఖీలు నిర్వహించి, వాహనాల రికార్డులు పరిశీలించినట్లు ఎస్‌ఐ తెలిపారు. ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ హెచ్చరించారు.

21మద్యం సీసాల స్వాధీనం: ఇద్దరి అరెస్టు

తొట్టంబేడు, ఫిబ్రవరి 13: శ్రీకాళహస్తి మండలంలోని తొండమనాడులో అక్రమంగా ఇంటి వద్ద మద్యం అమ్ముతున్న నవీన్‌ను పోలీసులు అరెస్టు చేశారు. అతడి వద్ద 21 మద్యం సీసాలు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ అజయ్ తెలిపారు. అదే విధంగా మండలంలోని శివనాథపురం వద్ద అక్రమంగా మద్యం తీసుకెళుతున్న ఏర్పేడు మండలం బత్తినయ్యకాలనీకి చెందిన మారయ్యను అరెస్టు చేసినట్లు తొట్టంబేడు ఎస్సై రాఘవేంద్ర తెలిపారు. అతడి నుంచి పదిమద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఆయన పేర్కొన్నారు.

బహిరంగంగా మద్యం సేవిస్తున్న వారిపై కేసు

ఏర్పేడు, ఫిబ్రవరి 13: మండల పరిసర ప్రాంతాల్లో బహిరంగంగా మద్యం సేవిస్తున్న 16మందిని ఏర్పేడు ఎస్‌ఐ జిలాని ఆధ్వర్యంలో సిబ్బంది పట్టుకున్నారు. తిరుపతి ఎస్పీ ఆదేశాల మేరకు బహిరంగంగా మద్యం సేవిస్తున్న 16మంది మీద కేసు నమోదు చేసినట్లు ఏర్పేడు ఎస్‌ఐ తెలిపారు.

నిర్దేశించిన లక్ష్యాలను త్వరగా పూర్తిచేయండి

● ఉపాధి పీడీ శ్రీనివాస ప్రసాద్

నాగలాపురం, ఫిబ్రవరి 13: ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లకు నిర్దేశించిన లక్ష్యాన్ని సకాలంలో పూర్తిచేయండని ఉపాధి హామీ పీడీ శ్రీనివాస ప్రసాద్ అన్నారు. మంగళవారం నాగలాపురంలోని ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో 2022-2023వ సంవత్సరానికి సంబంధించి 16వ విడత ఉపాధి సామాజిక తనిఖీ బహిరంగ సభ నిర్వహించారు. ఈ సభలో ఆయా శాఖకు సంబంధించిన ఫీల్డ్ అసిస్టెంట్లు పనుల వివరాలను తెలిపారు. మొత్తం రూ.8.71 కోట్లకు పనులు జరుగగా రూ.24వేలు అవకతవకలు జరిగినట్లు గుర్తించి రికవరీకి ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీవీఓ బాగ్యలక్ష్మి, జిల్లా అంబుడ్స్ పెర్సన్ నాయుడు, ఎంపీడీవో పీఎంకె బాబు, ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్లు, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

ఏర్పేడు పంచాయతీ ఆదాయం పెంచాం


కమ్మవీధిలో సీసీరోడ్డు పనుల్లో సర్పంచ్ శివయ్య తదితరులు

ఏర్పేడు, ఫిబ్రవరి 13: ఏర్పేడు పంచాయతీ ఆదాయాన్ని పెంచినట్లు సర్పంచ్ నల్లపాళెం శివయ్య ఒక ప్రకటనలో తెలిపారు.మొదటి విడతలో రూ.21.50 లక్షలతో ఐదు షాపింగ్ కాంప్లెక్సు గదులు, రెండవ విడతలో రూ.57లక్షలతో 9 షాపింగ్ కాంప్లెక్సు గదులను నిర్మించడంతో పంచాయతీకి ఏడాదికి రూ.17లక్షలు ఆదాయం వస్తోందన్నారు. అశోక్‌నగర్ గిరిజనకాలనీ, యాదవవీధి, గాండ్ల వీధి, పల్లివీధి, బజారువీధి, కమ్మవీధులకు సంబంధించి ఐదు శ్మశాన వాటికల్లో బోర్లు వేయించానన్నారు.అశోక్‌నగర్, యాదవవీధి, బజారువీధుల్లో మూడు బోర్లను వేసి తాగునీటి కొరతను తీర్చామన్నారు.

టీడీపీ విజయానికి కృషి చేయండి


సుధీర్‌కి స్వాగతం పలుకుతున్న గ్రామస్తులు

ఏర్పేడు, ఫిబ్రవరి 13: వచ్చే ఎన్నికల్లో టీడీపీ విజయానికి ప్రతి ఒక్కరూ కృషి చేసి వైసీపీ పాలనకు అంతం పలకాలని శ్రీకాళహస్తి నియోజకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జి బొజ్జల సుధీర్‌రెడ్డి కోరారు. ఏర్పేడు మండలం గుండ్లకండ్రిగ గ్రామంలో ఇంటింటికి మీ బొజ్జల కార్యక్రమం ద్వారా ప్రచారంచేపట్టారు. కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు ధనంజయల నాయుడు, మండలాధ్యక్షుడు పొన్నారావు, నాయకులు బాలాజీనాయుడు, నాగరాజునాయుడు, శ్రీధర్ నాయుడు, గణేష్‌నాయుడు, మనోహర్‌నాయుడు, అంకయ్య తదితరులు పాల్గొన్నారు.

మూడు దేవాలయాల్లో కుంభాభిషేకం


కుంభాభిషేకం పూజలు చేస్తున్న అర్చకులు

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 13: ముక్కంటి ఆలయానికి మూడు దేవాలయంలో కుంభాభిషేకం జరిగింది. మంగళవారం వేయి లింగాల కోనలోని మార్కండేయ తీర్థం, శ్రీకాళహస్తి పట్టణం పిట్టల వారి సందులోని దుర్గేశ్వర స్వామి ఆలయం, విస్తరణ శిక్షణ కేంద్రంలోని శివాలయంలో కుంభాభిషేకం పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ అంజూరు శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ఓటు హక్కు వినియోగంపై అవగాహన



ఏర్పేడు, ఫిబ్రవరి 13: ఓటు హక్కు వినియోగంతోనే ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా మంచిప్రభుత్వాన్ని ఎంచుకోగలుగుతామని సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాసులు మొదలియార్ అన్నారు. ఏర్పేడు మండలం అంజిమేడు పంచాయతీలో మంగళవారం అధికారులు ఈవీఎం పై డెమో నిర్వహించారు. ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా ప్రజలు ఓటుహక్కును వినియోగించుకోవాలని అధికారులు సూచించారు.

శ్రీకాళహస్తి

సత్యవేడు

కంకర క్వారీలకు అనుమతులివ్వొద్దు

● స్పష్టం చేసిన చమర్తికండ్రిగ గ్రామస్తులు


చమర్తికండ్రిగలో ప్రజాభిప్రాయ సేకరణ

సత్యవేడు, ఫిబ్రవరి 13: పంచాయతీలో ఇప్పటికే ఉన్న కంకర క్వారీలతో కాలుష్యం బారిన పడి ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని అధికారుల వద్ద గ్రామస్తులు గోడు వెళ్ళ వేసుకున్నారు. మంగళవారం కంకర క్వారీకి పర్యావరణ అనుమతులపై చమర్తికండ్రిగ ఎస్టీ కాలనీకి సమీపంలో డీఆర్వో పెంచల కిషోర్, తిరుపతి కాలుష్య నియంత్రణ మండలి ఈఈ చంద్రమోహన్ అధ్యక్షతన ప్రజాభిప్రాయ సేకరణ జరిగింది. ఈ సమావేశంలో పీవీ పురం పంచాయతీ వాసులు మాట్లాడుతూ ఇప్పటికే చమర్థకండ్రిగ ఎస్టీ కాలనీ చుట్టూ నాలుగు కంకర క్వారీలు నడుపుతున్నారని, క్వారీల నుంచి టిప్పర్లు రాకపోకల వలన రోడ్లు ధ్వంసం అవుతున్నట్టు అధికారుల దృష్టికి తెచ్చారు. దీంతో పాటు తాగునీటి పైపులైన్లు కూడా దెబ్బ తినడంతో తాగునీటికి ఇబ్బంది ఏర్పడే పరిస్థితి వచ్చిందన్నారు. అలాగే కంకరను వెలికి తీసేందుకు మందుగుండు పేల్చడం వల్ల వచ్చే శబ్దం ఈ ప్రాంత వాసుల్లో భయాందోళనలు నెలకొంటున్నట్లు స్పష్టం చేశారు. దీంతో పాటు కంకర క్రషింగ్ కారణంగా ధూళి కాలనీ వైపు వస్తుండడంతో ఇప్పటికే పలువురు అనారోగ్యం పాలైనట్లు తెలిపారు. శాశ్వతంగా రోడ్లు, పర్యావరణానికి ముప్పు లేని విధంగా నిర్దిష్ట చర్యలు తీసుకోవడం, చెట్లు నాటడం, క్వారీ సమీప కాలనీ వాసుల ఆరోగ్య భద్రతను పరిరక్షిస్తే తప్ప కొత్తగా క్వారీలకు పర్యావరణ అనుమతులివ్వద్దని తేల్చి చెప్పారు. అయితే దీనిపై మెజారిటీ ప్రజల అభిప్రాయం మేరకు తుది నిర్ణయం తీసుకుంటామని కాలుష్య నియంత్రణ మండలి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ చంద్రమోహన్ స్పష్టం చేశారు. కార్యక్రమంలో రెవెన్యూ డీటీ రవిచంద్ర బాబు, ఆర్ఐ కిరణ్‌కుమార్, ఇన్‌చార్జి వీఆర్వో భార్గవ్, పంచాయతీ సెక్రటరీ లీలా మాధవ్, పలువురు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

నేటినుంచి ఉద్యోగుల ఉద్యమ శంఖారావం

సత్యవేడు, ఫిబ్రవరి 13: ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల సమస్యల సాధనకై ఏపీ జేఏసీ పిలుపు మేరకు బుధవారం నుంచి ఉద్యమ శంఖారావం పేరుతో దశల వారీగా ఆందోళనలు నిర్వహించనున్నట్లు ఏపీ జేఏసీ సత్యవేడు తాలూకా చైర్మన్ లలిత్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉద్యోగుల సమస్య సంబంధించి గత ఐదేళ్లగా ఎటువంటి పరిష్కారం లేదన్నారు. ముఖ్యంగా డీఏ బకాయిలు పేరుకు పోతున్న దీనిపై ప్రభుత్వం స్పందించడం లేదన్నారు. కనీసం పీఆర్సీ అమలు కూడా నోచుకోలేకపోతున్నామన్నారు. ఉద్యోగుల సమస్యల గురించి పలుమార్లు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినా ప్రయోజనం లేకపోయిందన్నారు. ఈ నేపథ్యంలోనే అన్ని వర్గాల ఉద్యోగులు దీనిపై ఉద్యమం చేయడానికి సన్నద్ధమైనట్లు ఆయన తెలిపారు. ఈ నేపథ్యంలో 14న నల్ల బ్యాడ్జిలు ధరించి అన్ని కార్యాలయాల్లో వినతులు సమర్పిస్తామన్నారు. 15,16 తేదీల్లో భోజన విరామ సమయంలో నిరసనలు చేస్తామన్నారు. ఫిబ్రవరి 17న తాలూకా కేంద్రాల్లో ర్యాలీ ధర్నాలు నిర్వహిస్తామని, 20న కలెక్టరేట్ల వద్ద ధర్నా చేస్తామన్నారు. 21 నుంచి 24 వరకు అన్ని జిల్లాల్లో పర్యటించి ఉద్యోగులను సమాయత్తం చేస్తామన్నారు. 27న జరిగే చలో విజయవాడ నిర్వహించి ఉద్యోగుల సత్తా చూపిస్తామన్నారు.

పోలింగ్ బూత్‌ల పరిశీలన


కోవనూరులో పోలింగ్ బూత్ పరిశీలిస్తున్న తహసీల్దార్ శ్రీరాములు

కేవీబీపురం ఫిబ్రవరి13: మండలంలోని పోలింగ్ బూత్‌లను మంగళవారం తహసీల్దార్ శ్రీరాములు నాయక్ పరిశీలించారు. కోవనూరు, కర్లపూడి, కేవీబీపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పరిశీలించి, ధైర్యంగా మీకు నచ్చిన వారికి ఓటును నిర్భయంగా వేసుకోవచ్చని స్థానికులకు సూచించారు. కార్యక్రమంలో ఆర్ఐ సుబ్రమణ్యం, వీఆర్వో మునిరాజ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

బీజేపీ ఇంటింటి ప్రచారం

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 13: వచ్చే ఎన్నికల్లో బీజేపీని ఆదరించాలని ఆపార్టీ నేతలు విజ్ఞప్తి చేశారు. మంగళవారం పట్టణంలో ఇంటింటికి ప్రచారం చేశారు. బీజేపీ శ్రీకాళహస్తి నియోజకవర్గం కో కన్వీనర్ సుబ్రహ్మణ్యం రెడ్డి పట్టణంలోని పానగల్ ప్రాంతంలో ఇంటింటికి వెళ్లి అభ్యర్థించారు. అలాగే పట్టణ అధ్యక్షుడు గరికపాటి రమేష్ బాబు ఆధ్వర్యంలో భాస్కరపేట ప్రాంతంలో ప్రచారం చేశారు.

తొట్టంబేడు: పేద బడుగు బలహీనవర్గాల సంక్షేమమే బీజేపీ లక్ష్యమని మండల పార్టీ అధ్యక్షుడు వెడెం క్రిష్ణయ్య అన్నారు. మండలంలోని చోడవరం పంచాయతీలో మంగళవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి కరపత్రాలను, క్యాలండర్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండలంలోని బీజేపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

శిలాఫలకాలు వేశారు.. నగదు వివరాలు మరిచారు !



శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 13: ముక్కంటి ఆలయ అనుబంధ దేవాలయాల్లో ఆవిష్కరించిన శిలాఫలకాలపై అనుమానాలు వెల్లువెత్తాయి. శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి, ముక్కంటి ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ అంజూరు శ్రీనివాసులు అనుబంధ ఆలయాల్లో మంగళవారం మూడు శిలాఫలకాలు ఆవిష్కరించారు. ముత్యాలమ్మ ఆలయంలోని కల్యాణ మండపాన్ని పునః నిర్మించి ప్రారంభం చేసినట్లు శిలాఫలకం ఆవిష్కరించారు. అలాగే నీలకంఠేశ్వర స్వామి ఆలయంలో ముఖ ద్వారం, వంటశాల నిర్మించారు. భరద్వాజతీర్థంలో సిమెంట్ రోడ్డు ప్రారంభించారు. భరద్వాజ తీర్థం శిలాఫలకంలో రూ.1.20 కోట్లు అంచనా విలువ అని రాయించారు. కానీ మిగతా రెండు శిలాఫలకాల్లో మాత్రం నగదు వివరాలను ఎక్కడా ప్రస్తావించలేదు. సాధారణంగా శిలాఫలకాల్లో ప్రోటోకాల్ ప్రకారం పేర్లతోపాటు తప్పనిసరిగా ప్రాజెక్టు వ్యయం వెల్లడించి తీరాలి. కానీ ఇక్కడ శిలాఫలకంలో పేర్లతో ప్రచార ఆర్భాటం తప్ప అసలు విషయం కనబడలేదు. దీంతో నగదు వివరాలను వెల్లడించేందుకు దోబూచులాడుతున్నారన్న అనుమానాలు సర్వత్రా వ్యక్తమయ్యాయి. ఇక ఇంచార్జి ఈవో రామారావు మూడు ప్రారంభత్సవాల్లోనూ హాజరు కాలేదు. పాలకులు, అధికారి మధ్య ఏం జరిగిందని చర్చకు దారి తీసింది. అయితే హుండీ లెక్కింపులో ఉండడం కారణంగానే ప్రారంభోత్సవాలు హాజరు కాలేదని అధికారులు చెబుతున్నారు.

ముక్కంటికి రజత దర్పణం సమర్పణ


చైర్మన్‌కు వెండి దర్పణం అందజేస్తున్న భక్తులు

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 13: శ్రీకాళహస్తీశ్వరాలయానికి కడప నగరానికి చెందిన రెయిన్బో హాస్పిటల్ నిర్వాహకులు శ్రీనివాసరావు దంపతులు వెండి దర్పణం సమర్పించారు. ఈ మేరకు ఆలయంలోని గురుదక్షిణామూర్తి సన్నిధిలో మంగళవారం చైర్మన్ అంజూరు శ్రీనివాసులు అందజేశారు. ఈ సందర్భంగా నాతో మాట్లాడుతూ.. రూ1.12లక్షల విలువైన వెండి దర్పణం ఆలయానికి సమర్పించి మొక్కులు తీర్చుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ అసిస్టెంట్ కమిషనర్ మల్లికార్జున్ ప్రసాద్, ఆలయ తనిఖీదారు సుదర్శన్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

నైపుణ్యంతోనే పురోభివృద్ధి


నైపుణ్యాభివృద్ధి శిక్షణకు ఎంపికైన విద్యార్థులు

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 13: నైపుణ్యంతోనే పురోభివృద్ధి సాధ్యమని శ్రీకాళహస్తి మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ రాజశేఖర్ అన్నారు. పట్టణంలోని కళాశాలలో మంగళవారం బెంగళూరుకు చెందిన జాయిన్ ద డాట్స్ సంస్థ ఆధ్వర్యంలో నైపుణ్యాభివృద్ధిపై ఉచిత శిక్షణ కోసం పరీక్షలు నిర్వహించారు. ఎంపికైన విద్యార్థులకు ఏడాది శిక్షణ పూర్తయిన తర్వాత ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని ఫౌండేషన్ అధ్యక్షుడు ధనుంజయ్ తెలిపారు. వైస్ ప్రిన్సిపాల్ దీనదయాల్, జెకెసి కోఆర్డినేటర్ డాక్టర్ ఉషారాణి తదితరులు పాల్గొన్నారు.

జనసేన నేతల భేటి


నాదెండ్ల మనోహర్‌తో వినుత దంపతులు

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 13: జనసేన శ్రీకాళహస్తి నియోజకవర్గ ఇంచార్జి వినుత ఆపార్టీ పొలిటికల్ అఫైర్స్ కమిటీ చైర్మన్ నాదెండ్ల మనోహర్‌తో బేటి అయ్యారు. మంగళవారం విజయవాడలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో వినుత దంపతులు మనోహర్‌ను కలిసి ఎన్నికల అంశాలపై చర్చించారు.

ఏపీటీఎఫ్ ఆడిట్ కమిటీ సభ్యుడిగా వెంకటాద్రి



శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 13: ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర ఆడిట్ కమిటీ సభ్యుడిగా వెంకటాద్రి ఎన్నికయ్యారు. రాష్ట్ర కౌన్సిల్ సమావేశంలో ప్రకటించారు. శ్రీకాళహస్తి పట్టణం కాలనీలోని సరస్వతిభాయ్ పురపాలక సంఘ ఉన్నత పాఠశాలలో వెంకటాద్రి ఆంగ్ల ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. ఈమేరకు మంగళవారం తిరుపతి జిల్లా అధ్యక్షుడు మురళీకృష్ణ, ప్రధాన కార్యదర్శి బాలసుబ్రమణ్యం మంగళవారం అతడిని అభినందించారు. జిల్లా అధ్యక్షుడు మురళి మాట్లాడుతూ.. ఉద్యోగ ఉపాధ్యాయ సమస్యలపై పోరాటాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

గంగను వదిలి పంటలను కాపాడండి



తెలుగుగంగ కార్యాలయం ఎదుట రైతుల ఆందోళన

బుచ్చినాయుడుకండ్రిగ, ఫిబ్రవరి 13: తెలుగుగంగ నీరందించి ఎండుతున్న పంటలను కాపాడాలని సంబంధిత అధికారులకు మంగళవారం రైతులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ గ్రామంలో చెరువులోని నీరు చివరి తడిక మాత్రమే ఉన్నాయని, ప్రస్తుతం పంటలు పొట్ట దశలో ఉన్నాయని నీరు ఇవ్వకపోతే 1000 ఎకరాల్లో వేసిన వరి పంటలు ఎండిపోతాయని తెలిపారు. దీనిపై అధికారులు స్పందిస్తూ నీటి విషయంపై ఉన్నతధికారుల దృష్టికి తీసుకుపోతామని చెప్పారు.

ఆలయాల అభివృద్ధి మహద్భాగ్యం


వంటశాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 13: ఆలయాలను అభివృద్ధి చేసే అవకాశం లభించడం ఎంతో మహద్భాగ్యమని శ్రీకాళహస్తి ఎమ్మెల్యే వియ్యపు మధుసూదన్ రెడ్డి అన్నారు. ముక్కంటి ఆలయానికి అనుబంధంగా ఉన్న పలు ఆలయాల్లో అభివృద్ధి, పునర్నిర్మాణ పనులను మంగళవారం ప్రారంభించారు. ఇందులో భాగంగా నీలకంఠేశ్వర స్వామి ఆలయంలోని నూతన వంటశాల భవనం, ముత్యాలమ్మ ఆలయంలో నిర్మించిన కల్యాణ మండపం, భరద్వాజతీర్థంలో సిమెంట్ రోడ్డును ప్రారంభించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల మండల చైర్మన్ అంజూరు శ్రీనివాసులు, సభ్యులు, అర్చకులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సచివాలయాల ప్రారంభం

ఏర్పేడు, ఫిబ్రవరి 13: మండలంలోని పలుసచివాలయాలను ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి ప్రారంభించారు. మండలంలోని కందాడు, ఎండీపుత్తూరు, వికృతమాల, పంగూరు,చింతలపాళెం, పల్లం గ్రామాల్లో నూతన సచివాలయాల భవనాలు, వెల్‌నెస్ సెంటర్లను మంగళవారం ప్రారంభించారు.. ఈ కార్యక్రమంలో వైసీపీ మండలాధ్యక్షుడు కిషోర్‌రెడ్డి, ఎంపీపీ గీత, జడ్పీటీసీ తిరుమలయ్య, నాయకులు రమణయ్య యాదవ్, వీరరాఘవరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, జనార్ధన్‌రెడ్డి, శ్రీనుయాదవ్, జనార్ధన్‌యాదవ్, బత్తిశెట్టి, ఎంపీటీసీ భాస్కర్‌రెడ్డి, వెంకటేష్, శేఖర్‌రాజు, సర్పంచ్ మోహనప్రియ, గోవర్ధన్‌రెడ్డి, బాలాజీరెడ్డి, సర్పంచ్ రామమూర్తి తదితరులు పాల్గొన్నారు.

దక్షిణ కాళికాదేవికి ప్రత్యేక పూజలు



శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 13: శ్రీకాళహస్తి మండలం వేడాం గ్రామంలో వెలసిన దక్షిణ కాళికాదేవికి మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం రాహుకాలం సమయంలో అర్చకులు అమ్మవారి మూలమూర్తికి అభిషేకాలుని ర్వహించి, ప్రత్యేకంగా అలంకరించారు. శ్రీకాళహస్తి పట్టణంతోపాటు పలు గ్రామా ల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ నిర్వాహకులు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేయగా, మధ్యాహ్నం దాతలు ఆలయంలో భక్తులకు అన్నదానం చేశారు.

వేడుకగా కాలభైరవ స్వామి ప్రాకారోత్సవం


హారతులిస్తున్న ప్రధానార్చకుడు కరుణాకర్ గురుకుల్

శ్రీకాళహస్తీశ్వర ఆలయంలో వెలసిన కాలభైరవ స్వామికి మంగళవారం ప్రాకారోత్సవం వేడుకగా జరిగింది. ఆలయ అర్చకులు కాలభైరవ స్వామి సన్నిధిలో శుద్ధి , అనంతరం మంగళ వాయిద్యాల నడుమ అభిషేకాలు చేశారు. కాలభైరవ స్వామి ఉత్సవ మూర్తిని అలంకరించి మహాద్వారం మీదుగా విజయ స్థూపం వరకు వెళ్ళి అక్కడి నుంచి ప్రదక్షిణగా చేసి తిరిగి ఆలయంలో కొలువు తీర్చారు. ఈ కార్యక్రమంలో ఆలయ పాలకమండలి సభ్యులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.



ఆంజనేయ స్వామికి విశేష పూజలు

శ్రీకాళహస్తీశ్వర ఆలయంలోని పదహారు కాళ్ల మండపంలో వెలసిన ఆంజనేయ స్వామికి మంగళవారం పూజలు జరిగాయి. భక్తులు తమలపాకుల మాలలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

సచివాలయ భవనాల నిర్మాణం ఎప్పుడో ?


శంకుస్థాపనకే పరిమితమైన రెండవ సచివాలయం


మొదటి స్లాబ్‌తో ఆగిపోయిన నాలుగో నెంబర్ సచివాలయం

రేణిగుంట, ఫిబ్రవరి13: మండలంలో సచివాలయ భవనాలు నిర్మించేందుకు కొంతమంది మండలవైసీపీ నాయకులు బాధ్యతలు తీసుకొని నాలుగున్నరేళ్ళు పూర్తికావస్తున్నా ఇప్పటికీ పనులు చేపట్టకపోవడం శోచనీయం. ఈవిషయంపై నియోజకవర్గం నాయకులు దృష్టి సారించకపోవడం విచారకరం. రాష్ట్రంలో వైఎస్.జగన్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం నూతనంగా సచివాలయ వ్యవస్థను తీసుకువచ్చి సచివాలయ భవన నిర్మాణాలకు నిధులు కేటాయించారు.

మండలంలో 22 సచివాలయాలున్నాయి. ఈ మేరకు మామండూరులో భవన నిర్మాణం కడగాలువరకే నిర్మాణం జరిగింది.కృష్ణాపురంలో 50శాతం పనులు జరిగాయి. రేణిగుంటటౌన్‌లో ఐదు సచివాలయాలకు నాలుగో నెంబరు సచివాలయ భవనం మాత్రం మొదటి స్లాబ్ వేసి వదిలేశారు. రెండో సచివాలయ భవననిర్మాణం కోసం శంకుస్థాపన చేసి వదిలేశారు.

మండలంలో మిగిలిన అన్నీ పంచాయతీల్లో 90శాతం పనులు పూర్తి చేశారు. ఇందులో నాలుగు సచివాలయ భవనాలు ప్రారంభానికి సిద్ధంగావున్నట్ల సమాచారం. మండలంలో సచివాలయ భవన నిర్మాణాలకు నిధులువున్నా ఎందుకు పూర్తి చేయలేదని నిర్మాణ బాధ్యత తీసుకున్న మండలపార్టీ నాయకులను నియోజకవర్గం నాయకులు గాని, అధికారులు గాని ప్రశ్నించకపోవడంపై సొంతపార్టీ నాయకులే పలురకాలుగా చర్చించుకోవడం విశేషం.

మండలంలో పూర్తయిన భవనాలను రెండు,మూడు రోజుల్లో ప్రారంభించడానికి ఎమ్మెల్యేను ఆహ్వానించినట్లు సమాచారం. రేణిగుంట టౌన్‌లోవున్న ఐదు సచివాలయాల భవనాల నిర్మాణాల పనులు ఎందుకు పూర్తి చేయలేదనే ప్రశ్న అలాగే మిగిలి పోయే అవకాశంవుంది.